


దీపావళి శుభాకాంక్షలు

పాఠకులకు,మా శ్రేయోభిలాషులకు, సన్నిహితులకు,ప్రకటనకర్తలకు,మా పాత్రికేయ బృందానికి,సిబ్బందికి దీపావళి పర్వదిన శుభాకాంక్షలు. పండుగ సందర్భంగా (31 నాడు గురువారం) మా కార్యాలయానికి సెలవు. 1న పత్రిక వెలుబడదు. పాఠకులు గమనించగలరు. మేనేజర్.



www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY — నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 31 గురువారం అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 45

Navabhoomi daily fallows..



ANU FURNITURE®

HYDERABAD | BENGALURU

Call: +91 9100913033, 8688003033





## భారీగా తగ్గిన పెట్రో ధరలు

- ఆరు రాష్ట్రాల్లో భారీగా తగ్గిన పెట్రోల్, డీజిల్ ధరలు
- దీపావళి గిఫ్ట్ ప్రకటించిన ఆయిల్ కంపెనీలు
- పెట్రోల్ పంప్ డీలర్లకు కమిషన్ పెంచుతున్నట్లు ప్రకటన
- పెట్రోల్ లీటర్‌కు రూ.4.69,డీజిల్‌కు రూ.4.45పైసలు తగ్గింపు
- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే దిశగా చర్యలు
- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ వెల్లడి

2



**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** దీపావళి సందర్భంగా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలుశుభవార్త చెప్పాయి. పెట్రోల్ పంప్ డీలర్స్‌కు చెల్లించే డీలర్ కమీషన్‌ను పెంచుతున్నట్లు ప్రకటించాయి. బుధవారం నుంచే ఈ పెంచిన డీలర్ కమీషన్ అమల్లోకి రానుంది. ఈ విషయాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. ఈ ప్రభావంతో దేశంలోని పలు

## టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు

- టీటీడీ చైర్మన్‌గా టీవీ 5 అధినేత బీఆర్ నాయుడు
- 24 మంది సభ్యులతో టీటీడీ బోర్డు ఏర్పాటు
- వీరిలో తెలంగాణ నుంచి ఐదుగురు, కర్ణాటక నుంచి ముగ్గురు, తమిళనాడు నుంచి ఇద్దరు,గుజరాత్, మహారాష్ట్రల నుంచి ఒక్కొక్కరు చొప్పున అవకాశం
- బీజేపీ ప్రతిపాదించిన వెంటనే మరో సభ్యుడి నియామకం



**అమరావతి-నవభూమిబ్యూరో:** 24 మంది సభ్యులతో టీటీడీ బోర్డును ఏర్పాటు చేసింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడిని నియమించింది. ఈ మేరకు బుధవారం నాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలిలో మొత్తం 24 మంది సభ్యులు ఉండగా.. వీరిలో తెలంగాణ నుంచి ఐదుగురు, కర్ణాటక నుంచి ముగ్గురు, తమిళనాడు నుంచి ఇద్దరు, గుజరాత్, మహారాష్ట్రల నుంచి ఒక్కొక్కరు చొప్పున అవకాశం కల్పించారు. ఈసారి టీటీడీ పాలకమండలిలో సగం మంది పొరుగు రాష్ట్రాల వారికి అవకాశం కల్పించడం విశేషం. కాగా, 24 మంది సభ్యులను ప్రకటించిన ఆంధ్రప్రభుత్వం.. మరొక సభ్యుడిని నియమించాల్సి ఉంది. బీజేపీ నుంచి మరో పేరు ప్రతిపాదన వచ్చిన వెంటనే ఆ సభ్యుడిని కూడా నియమించనున్నారు.

**తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు వీరే..**

సాంబశివరావు (జాస్తి శివ)
శ్రీసదాశివరావు నన్నపనేని
ఎం.ఎస్ రాజు (మడకశిర ఎమ్మెల్యే)
జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట ఎమ్మెల్యే)
ప్రశాంతిరెడ్డి (కొవ్వూరు ఎమ్మెల్యే)
పనబాక లక్ష్మి (మాజీ కేంద్ర మంత్రి)
మల్లెల రాజశేఖర్ గౌడ్
జంగా కృష్ణమూర్తి
బురగపు ఆనందసాయి
సుచిత్ర ఎల్లా

2

## కులగణనలో తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా మార్చాలి

- సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతాం
- కుల గణనపై సమన్వయానికి 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియామకం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కులగణనలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం

### 6 నుంచి తెలంగాణలో కులగణన

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** నవంబర్ 6 నుంచి తెలంగాణలో కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నారు. దేశంలో తొలిసారిగా ఇక్కడ కులగణన చేపట్టనున్నారు. నవంబర్ 6న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. 2లో

## గోదావరి పుష్కరాల ముహూర్తం ఖరారు

- 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణ
- ఈ సారి పుష్కరాల కోసం 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- పుష్కర ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో ప్రతిపాదనలు
- మరో నాలుగు కొత్త ఘాట్లు అవసరమని భావిస్తున్న అధికారులు
- రెండున్నర ఏళ్ల వ్యవధి ఉన్నా ఇప్పటి నుంచే పనులు ప్రారంభం

2



**అమరావతి-నవభూమిబ్యూరో:** కోట్లాది మంది పవిత్రంగా భావించే గోదావరి పుష్కరాలకు ముహూర్తం ఖరారైంది. దేశ విదేశాల నుంచి గోదావరి పుష్కరాలకు తరలి రానున్నారు. దీంతో, ప్రభుత్వం..స్థానిక నేతలు - యంత్రాంగం అప్రమత్తం అయ్యారు. ముందస్తు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. చేపట్టాల్సిన పనుల పైన నిర్ణయానికి వచ్చారు. ఈ సారి గోదావరి పుష్కరాల నిర్వహణ లో ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. తాజాగా పుష్కరాల నిర్వహణ కోసం పలు నిర్ణయాలు తీసుకున్నారు.

**ముహూర్తం ఖరారు**

2027 జూలై 23 నుంచి ఆగస్టు 3 వరకు గోదావరి పుష్కరాల నిర్వహణకు నిర్ణయించారు. ప్రతీ 12 ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కరాల కోసం ప్రభుత్వం ఏర్పాట్లు మొదలు పెట్టింది. 2015 లో ఇదే గోదావరి పుష్కరాల

## నాగార్జున, కేటీఆర్ పిటిషన్లపై విచారణ వాయిదా

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్లపై నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణ జరిగింది.కొండా సురేఖ తరఫున న్యాయవాది గురుమిత్‌సింగ్ హాజరయ్యారు. రెండు పిటిషన్లపై విచారణను న్యాయస్థానం నవంబర్ 13కు వాయిదా వేసింది.

## యూట్యూబర్ హర్షసాయికి ముందస్తు బెయిల్

- తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ హర్షసాయిపై ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు
- తనపై పెట్టిన లైంగిక వేధింపుల కేసు చెల్లదని హర్ష హైకోర్టులో పిటిషన్
- కేసు నమోదైనప్పటి నుంచి పరారీలోనే..

2



## విచారణకు హాజరైన రాజ్ పాకాల

- జన్వాడ ఫామ్ హౌస్‌లో విందు కేసులో రాజ్‌పై విచారణ
- మోకిల్ పోలీసుస్టేషన్‌లో న్యాయవాదితో హాజరైన రాజ్
- దాదాపు 7గంటల పాటు విచారించిన నార్సింగి ఏసీపీ

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** జన్వాడ ఫామ్‌హౌస్ కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల మోకిల పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. న్యాయవాదితో పాటు ఆయన విచారణకు వచ్చారు.నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ ఆధ్వర్యంలో విచారణ సాగుతోంది. ఇటీవల రాజ్ పాకాలకు

## ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయండి

- బీసీ రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు ఆదేశం
- బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగింత
- సవాల్ చేస్తూ ఆర్.కృష్ణయ్య హైకోర్టుకు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది.బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు.

## 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ

- విజన్ డాక్యుమెంట్ 2047కు సంబంధించిన అంశాలపై
- సీఎం చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం చర్చ
- ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర
- విజన్ డాక్యుమెంట్ 2047 ప్రణాళిక రూపకల్పన
- రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో డాక్యుమెంట్



**అమరావతి-నవభూమిబ్యూరో:** విజన్ డాక్యుమెంట్ 2047కు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం సమావేశమై చర్చించారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ భేటీలో నీతి ఆయోగ్‌కు సంబంధించిన సలహాదారు, డైరెక్టర్లతోపాటు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ 2047 ప్రణాళిక రూపొందించినట్లు సీఎం చంద్రబాబు వివరించారు.

2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీ అభివృద్ధే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. వ్యవసాయం, ఆక్వా తదితర రంగాల్లో అభివృద్ధి సాధించేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు సీఎం నీతిఆయోగ్ సీఈఓకు వివరించారు. పేదరిక నిర్మూలన, ఈజ్ ఆఫ్ లివింగ్, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, డెమోగ్రాఫిక్ మేనేజిమెంట్, డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి గ్రోత్ ఇంజిన్లతో వృద్ధిరేటు సాధించేలా ఈ ప్రణాళికలు రూపొందాయని, వీటిని సమర్థంగా అమలు చేసేలా కార్యాచరణ చేసినట్లు సీఎం తెలిపారు.

## నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు

- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ షెడ్యూల్ విడుదల
- రెండు సెషన్లలో గ్రూప్-3 పరీక్షలు
- తెలంగాణలో 1380కి పైగా గ్రూప్-3 పోస్టులకు 5.36 లక్షల మందికి పైగా దరఖాస్తులు


2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణలో గ్రూప్-3 అభ్యర్థులకు కీలక అప్‌డేట్ వచ్చింది. నవంబర్ 17, 18 తేదీల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు ఇప్పటికే ప్రకటించిన తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది.రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించనుండగా.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 1 మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్ -2 నిర్వహించనున్నారు. అలాగే, నవంబర్ 18న పేపర్ 3 పరీక్షను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహిస్తారు. నవంబర్ 10న హాల్ టికెట్లు అందుబాటులోకి రానున్నాయి.గ్రూప్ 3

## మయోనైజ్‌పై నిషేధం

2

- వైద్యారోగ్యశాఖ కీలక నిర్ణయం
- రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్
- ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశం
- ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం
- వైద్యారోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ప్రకటన
- ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే

## ఎన్‌హెచ్65 విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

- ఏపీ, తెలంగాణా రాష్ట్రాలకు ఎన్‌హెచ్ 65 విస్తరణపై కేంద్రం శుభవార్త!
- నాలుగు లైన్ల నుండి ఆరు లైన్ల విస్తరణకు కేంద్రం అనుమతి
- పూనే నుంచి ఆంధ్రప్రదేశ్లోని మచిలీపట్నం కలుపుతూ ఎన్‌హెచ్ 65
- 841 కిలోమీటర్ల పొడవుతో ఏపీలో 430 కిలోమీటర్ల కొనసాగింపు

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ తెలంగాణ రాష్ట్రాలకు కేంద్రం మరో మారు శుభవార్త చెప్పింది. ఇప్పటికే రైల్వే ప్రాజెక్టులు, రోడ్డు ప్రాజెక్టులతో రెండు తెలుగు రాష్ట్రాలలో అభివృద్ధి పై ఫోకస్ చేసిన కేంద్రం జాతీయ రహదారి 65 విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

## జెత్వానీ కేసు.. విచారణ ప్రారంభించిన సీఐడీ



**అమరావతి-నవభూమిబ్యూరో:** ముంబయి నటి జెత్వానీ కేసులో సీఐడీ అధికారులు విచారణ ప్రారంభించారు. కేసుకు సంబంధించిన దస్త్రాలను ఇబ్రహీంపట్నం పోలీసుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. మిగతా 2లో

## ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష తేదీ ఖరారు

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీపీఎస్సీగ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది జనవరి 5న 13 ఉమ్మడి జిల్లాల్లో ఈ పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది.రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు లక్ష మంది వరకు ఈ పరీక్ష రాసే అవకాశం ఉంది. డీఎస్సీ, ఎస్ఎస్సీ, ఇంటర్ బోర్డు -2లో

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 | హైదరాబాద్
గురువారం
31 , అక్టోబర్ , 2024



## మంచిర్యాల జిల్లాలో వింత ఘటన..

**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో వరుసగా వింత ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఇటీవలే.. జగిత్యాల జిల్లాలోని ఎండపల్లిలో ఏళ్లనాటి చింతచెట్టుకు కల్లు వస్తుండటం అందరినీ ఆశ్చర్యపరిస్తే.. ఇప్పుడు మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఎలక్కపేటలో మరో వింత ఘటన వెలుగుచూసింది. నల్లటి గేదెకు తెల్లని రంగులో దూడ జన్మించింది. ఈ ఘటన ఆ గ్రామస్థులనే కాకుండా చుట్టుపక్కల ఊళ్ల ప్రజలను కూడా ఆశ్చర్యంలో ముచ్చెత్తుతోంది. దీంతో.. ఆ వింత ఘటనను చూసేందుకు జనాలు ఎగబడిపోతున్నారు.సమాజంలో కొన్ని అసాధారణ ఘటనలు జరగటం చూస్తుంటే.. ఆశ్చర్యం వేస్తుంది. మరికొన్ని ఘటనలు చూస్తుంటే.. పోతులూరి వీరబ్రహ్మంగారు చెప్పింది అక్షరాలా నిజమవుతోందా ఏంటీ అన్న అనుమానం కలుగుతుంటుంది. అచ్చంగా అలాంటి అభిప్రాయమే వ్యక్తం చేస్తున్నారు మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఎల్లక్కపేట గ్రామస్థులు. ఎల్లక్కపేట గ్రామంలో చోటుచేసుకున్న ఘటన.. అలనాటి 'సప్తపది' సినిమా పాటలోని "తెల్లవావు కదుపునా ఎర్రావు పుట్టదా..? కర్రావు కదుపునా తెల్లావు పుట్టదా..?" లిరిక్స్‌ను గుర్తుచేస్తున్నాయి. తెల్లని ఆవులకు నల్లటి దూడలు పుట్టటం సర్వసాధారణం కానీ.. నల్లని గేదెకు తెల్ల రంగున్న దూడ పుట్టడమనేది అత్యంత అరుదు. ఎల్లక్కపేటలో ఆ అరుదైన ఘటనే చోటుచేసుకుని.. అందరిని ఆశ్చర్యపోయేలా చేస్తోంది.ఎల్లక్కపేట గ్రామానికి చెందిన దండ్ల సతీష్ అనే రైతు దగ్గరున్న ఓ గేదె.. నిన్న (అక్టోబర్ 29న) తెల్లని దూడపిల్లకు జన్మనిచ్చింది. తల్లి గేదే పూర్తిగా నల్లగా ఉండగా.. పుట్టిన దూడ మాత్రం పూర్తిగా తెల్లటి రంగులో ఉండటం ఇప్పుడు సర్వత్రా ఆసక్తికర అంశంగా మారింది. తమ గేదే తెల్లని దూడకు జన్మనివ్వటంతో ఆ రైతు కుటుంబం ఆశ్చర్యానికి లోనయ్యారు.



# 8 గంటల్లో 80 ప్రశ్నలు




**శంకర్‌పల్లి-నవభూమి:** మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది రాజ్ పాకాలను మోకిల పోలీసులు 8 గంటలపాటు ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేశారు. దాదాపు 80 నుంచి వంద ప్రశ్నలు అడిగారని తెలుస్తోంది. దావత్‌కు ఎవరెవరు వచ్చారు? నుంచి మొదలుకుని పార్టీలోకి కొకైన్ ఎక్కడి నుంచి వచ్చిందనే అంశం వరకూ ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. మరీ ముఖ్యంగా విజయ్ మద్దూరి ఫోన్ గురించి ఆరా తీశారు. ఫామ్‌హౌజ్ పార్టీ కేసులో రాజ్ పాకాలకు హైకోర్టు విధించిన గడువు బుధవారంతో ముగియడంతో ఆయన పోలీసు విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.16 గంటలకు ఇద్దరు న్యాయవాదులతో వచ్చారు. నార్సింగి ఏసీపీ రమణ గౌడ్ పర్యవేక్షణలో ఆయనను న్యాయవాదుల సమక్షంలో విచారించారు. ఆయన మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

**పోలీసులకు విజయ్ మద్దూరి ఝలక్**

రాజ్ పాకాల ఫామ్‌హౌజ్‌లో పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. పార్టీలో విజయ్ మద్దూరికి డ్రగ్స్ టెస్టు చేయగా.. ఆయన కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. ఆయనపై కేసు నమోదు చేశారు. అయితే, ఫామ్‌హౌజ్‌లోనే విజయ్‌ను అదుపులోకి తీసుకోవడానికి ముందు ఆయన పోలీసులు తీసుకున్నారు. కానీ, ఆ సమయంలో విజయ్ పక్కనే ఆయన భార్య ఉన్నారు. ఆమె తనకు తెలిసిన ఓ మహిళ మొబైల్‌ను విజయ్ ఫోన్ అని చెప్పి పోలీసులకు అందజేశారు. అనంతరం స్టేషన్ బెయిల్ ఇచ్చి విజయ్‌ను పంపేశారు. ఆ తర్వాత సదరు మహిళ వచ్చి తన ఫోన్ ఇవ్వాలంటూ పోలీసులను ఆశ్రయించారు.

ఈ నేపథ్యంలోనే, విజయ్ మద్దూరి తమకు ఫోన్ ఇవ్వని విషయాన్ని ప్రస్తావించారు. ఆయన ఎక్కడ ఉన్నారు? ఆయన ఫోన్ ఎక్కడ ఉంది? అని ప్రశ్నించారు. ఆయన ఫోన్ విషయం తనకు తెలియదంటూనే ఫాంహౌజ్‌లో ఏమైనా పడిపోయిందేమోనని రాజ్ పాకాల సమాధానమిచ్చినట్లు తెలుస్తోంది. దాంతో, ఫోన్ వెతికేందుకు పోలీసులు మధ్యాహ్నం 3:11 గంటలకు రాజ్ పాకాలను ఆయన ఫాంహౌజ్‌కు తీసుకెళ్లారు. అక్కడ 4 బెడ్ రూముల్లో లాకర్లను తెరిపించి పరిశీలించారు. డిజిటల్ లాకర్లను కూడా తెరిపించి పరిశీలించారు. సుమారు గంటపాటు తనిఖీ చేసినా ఫోన్ దొరకలేదు. ఆయనను తిరిగి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి రాత్రి 8.16 గంటల వరకూ మరోసారి విచారించారు. అవసరమైతే మరోసారి విచారణకు రావాలని చెప్పి.. స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది పోలీసులతో బందోబస్తులో ఏర్పాటు చేశారు.

## ఇప్పుడు ఎన్నికలు పెడితే జరిగేది ఇదే..



**హైదరాబాద్-నవభూమి:** రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే బీఆర్ఎస్‌కు 100 సీట్లు వస్తాయని మాజీ మంత్రి హరీష్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి.. కేసీఆర్ పెట్టిన బిక్ష అంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ లేకుంటే.. తెలంగాణ వచ్చేది కాదన్నారు. తెలంగాణ లేకుంటే రేవంత్ రెడ్డి సీఎం అయ్యేవారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు, రేవంత్‌కు నక్కకూ.. నాగలోనికి ఉన్నంత తేడా ఉందన్నారు. సీనియర్లు తన కుర్చీని గుంజుకోకుండా రేవంత్ చూసుకోవాలంటూ హితవుపలికారు. కుర్చీని ఎప్పుడు ఎవరు గుంజుకుపోతారోనన్న భయంతో రేవంత్ ఉన్నారన్నారు. ఐదేళ్ళ తర్వాత వచ్చేది బీఆర్ఎస్ అని... సీఎం అయ్యేది కేసీఆర్ అని స్పష్టం చేశారు. దేశంలో కాంగ్రెస్ మూడు సార్లు ఓడిందని.. దాంతో కాంగ్రెస్ ఖతం అయిపోయిందా ప్రశ్నించారు.రుణమాఫీ విషయంలో రేవంత్ రైతులను మోసం చేశారని మండిపడ్డారు. ఆరు మంత్రి పదవులను నింపడానికే రేవంత్‌కు హైకమాండ్ అనుమతి ఇవ్వట్లేదని.. డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులను కూడా నింపలేదన్నారు. రేవంత్ రెడ్డి అబద్దాలు చూసి గోబెల్స్ కూడా సిగ్గుపడ్తారన్నారు. రేవంత్ రెడ్డి మాటలపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. సీఎం మాటలు విన్న పిల్లలు.. వాటినే పరీక్షల్లో రాస్తే పరిస్థితి ఏంటి అని ప్రశ్నించారు. హైదరాబాద్‌కు మూడు దిక్కుల సముద్రం ఉందన్న రేవంత్ కామెంట్స్‌పై సోషల్ మీడియాలో జోకులు పేలుతున్నాయన్నారు. రాజీవ్ గాంధీ కంప్యూటర్ కనిపెట్టాడని అంటారని ఎద్దేవా చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్ముతారని రేవంత్ అనటం హాస్యాస్పదమని మాజీ మంత్రి అన్నారు.మూసీని శుద్ధి చేయాలని సంకల్పించిందే కేసీఆర్ అని తెలిపారు. మూసీని శుద్ధి చేయటానికి బీఆర్ఎస్ అనుకూలమని.. అయితే సుందరీకరణ పేరుతో పేదల ఇళ్ళను కూల్చటానికి మాత్రం బీఆర్ఎస్ వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీపై బీఆర్ఎస్ వైఖరిని కేటీఆర్ చెప్తూనే ఉన్నారన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు తమకంటే బెటర్‌గా చేయవచ్చు కదా అని అన్నారు. మల్లన్నసాగర్ బాధితులకు గచ్చిబౌలిలో 500 గజాల్లో ఇళ్ళు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏక్ పోలీస్ అమలు చేయమంటే సస్పెండ్ చేయటం అన్యాయమన్నారు. ఏక్ పోలీస్ అమలు చేస్తామని ఎన్నికల్లో రేవంత్ చెప్పలేదా అని ప్రశ్నించారు. తనకు రక్షణ కల్పించే పోలీసులపై కూడా రేవంత్‌కు నమ్మకం లేకుండా పోయిందన్నారు. తండ్రే తన పిల్లలను నమ్మనట్లు.. రేవంత్ తీరుందన్నారు. కానిస్టేబుల్స్ సమస్యలు తెలుసుకునే సమయం సీఎంకు లేదా అని హరీష్ రావు ప్రశ్నల వర్షం కురిపించారు.

## ఎన్‌హెచ్65 విస్తరణకు గ్రీన్‌సిగ్నల్

**(1వపేజీ తరువాయి)**ప్రస్తుతం నేషనల్ హైవే 65 నాలుగు లైన్లు ఉండగా నాలుగు లైన్ల నుండి ఆరు లైన్ల విస్తరణకు కేంద్రం అనుమతినిచ్చింది.

**జాతీయ రహదారి 65 విస్తరణ**

యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం నుంచి ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు వరకు జాతీయ రహదారి 65 ను విస్తరించారు. దాదాపు 1800 కోట్ల రూపాయలతో జాతీయ రహదారిని నాలుగు లైన్లతో నిర్మించారు. అయితే ఈ సమయంలోనే ఆరు లైన్ల రహదారి కోసం భూసేకరణ కూడా నిర్వహించారు.

**ఆరు లేన్ల విస్తరణకు కేంద్రం గ్రీన్ సిగ్నల్**

అయితే ఈ నేషనల్ హైవే ఆరు లేన్ల విస్తరణ కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్లు రవాణా శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పలుమార్లు కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ తో సమావేశమై విజ్ఞప్తి చేశారు . దీంతో ఎట్టకేలకు ఆరు లైన్ల జాతీయ రహదారిగా దీనిని విస్తరించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ జాతీయ రహదారి విస్తరణ జరిగితే రవాణా మరింత సునాయాసం అవుతుందని, ప్రమాదాలు తగ్గుతాయని భావిస్తున్నారు.

**భారతదేశంలో ప్రధాన జాతీయ రహదారి 65**


భారతదేశంలో ప్రధానమైన జాతీయ రహదారిగా ఉన్న 65 నెంబర్ జాతీయ రహదారి మహారాష్ట్రలోని పూనే పట్టణాన్ని ఆంధ్రప్రదేశ్లోని మచిలీపట్నం పట్టణాన్ని కలుపుతూ సాగింది. గతంలో జాతీయ రహదారి 9 గా ఉన్న ఇది జాతీయ రహదారి 65గా మార్చబడింది. మొత్తం మహారాష్ట్రలో 336 కిలోమీటర్లు, కర్ణాటకలో 75 కిలోమీటర్లు, ఆంధ్ర ప్రదేశ్‌లో 430 కిలోమీటర్ల తో కలిపి సుమారు 841 కిలోమీటర్ల పొడవుతో ఉంది.

**ఏపీ, తెలంగాణా వాసులకు సంతోషం**

ఈ జాతీయ రహదారిని విస్తరించడానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏపీ తెలంగాణ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు లైన్ల జాతీయ రహదారిని ఆరు లేన్ల జాతీయ రహదారిగా విస్తరించడానికి కేంద్ర అనుమతించడంతో ఇప్పటికే భూసేకరణ పనులు కూడా పూర్తి కావడంతో త్వరలోనే ఈ పనులు ప్రారంభం కానున్నాయి.

## అయోధ్యలో దీపావళి సంబరాలు వరల్డ్ రికార్డు

**లక్నో-నవభూమి:** బాలరాముడు కొలువైన అయోధ్యలో దీపావళి సంబరాలు కన్నులపండువగా మొదలయ్యాయి. సరయూ నదీ తీరంలో ఎనిమిదేళ్లుగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దీపోత్సవం' ఈసారి మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. అయోధ్యలో భవ్య రామాలయం నిర్మాణం జరిగిన తర్వాత జరిగిన తొలి దీపోత్సవం ఇదే కావడంతో అయోధ్య నగరం దీపకాంతులతో మెరిసిపోయింది. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'దీపోత్సవ్'ను ప్రారంభించగా, భక్తులు ఏకకాలంలో 25 లక్షలకుపైగా దీపాలు వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. సరయూ నది ఘాట్‌లో 1,100 మంది హారతులు ఇవ్వడం ద్వారా మరో సరికొత్త రికార్డు కూడా సిద్ధమైంది.



## ఆ విషయంలో తెలంగాణ టాప్.. రెండో స్థానంలో ఏపీ



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో దావత్ ఉందంటే ముక్కతో పాటు చుక్క కూడా ఉండాల్సిందే. దేశంలోనే మద్యం అధికంగా సేవించే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఒకటి. అందుకే ఎక్సైజ్ రెవెన్యూ ఈ రాష్ట్రాల్లో అధికంగా ఉంటుంది. తాజాగా ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ దేశంలో సగటున ఓ వ్యక్తి మద్యం కోసం చేసిన ఖర్చులకు సంబంధించిన జాబితా విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం మద్యం కోసం సగటున ఓ వ్యక్తి చేసిన ఖర్చులో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలవగా.. ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. అత్యంత తక్కువ ఖర్చు చేసిన రాష్ట్రాల్లో వెస్ట్ బెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. మద్యపాన నిషేధం అమలుచేస్తున్న రాష్ట్రాలు మినహా మిగతా రాష్ట్రాలకు సంబంధించి 2022-23 సంవత్సరంలో ఓ వ్యక్తి మద్యంపై చేస్తున్న ఖర్చులకు సంబంధించిన జాబితాను ఎన్ఐపిఎఫ్‌పి విడుదల చేసింది.

టాప్‌లో తెలంగాణ

2022-23 సంవత్సరంలో తెలంగాణలో సగటున ఓ వ్యక్తి మద్యంపై చేసిన ఖర్చు రూ.1623గా ఎన్ఐపిఎఫ్‌పి తెలిపింది. దేశవ్యాప్తంగా ఇదే అత్యధికంగా పేర్కొంది. ఆ తరువాత రూ.1306 ఖర్చుతో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. రూ.1245తో పంజాబ్ మూడోస్థానంలో, రూ.1227తో ఛత్తీస్‌గడ్ నాలుగోస్థానంలో ఉండగా, రూ.1156తో ఒడిస్సా ఐదో స్థానంలో ఉన్నాయి. తెలంగాణలో ఏదైనా పార్టీలో మద్యం తీసుకోవడం సంప్రాదాయంగా వస్తోంది. దీంతో ఎవరైనా ఇంట్లో చిన్నపాటి ఫంక్షన్ అయినా ఫుడ్‌తో పాటు మద్యం తప్పకుండాఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలో దీనిని ఓ సంప్రదాయంగా చూస్తారు. దీంతో మద్యంపై ఎక్కువ ఖర్చుచేస్తున్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ మొదటిస్థానంలో నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దేశంలో ఎక్కువగా మద్యంపై ఖర్చుచేసే రాష్ట్రాల్లో ఏపీ ఉండగా.. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ మొదటి జాబితాలో ఉంది.

**చివరి స్థానంలో వెస్ట్‌బెంగాల్**

మద్యంపై ఓ వ్యక్తి అతి తక్కువ ఖర్చు చేస్తున్న రాష్ట్రాల జాబితాలో వెస్ట్ బెంగాల్ మొదటివరుసలో ఉంది. 2022-23 సంవత్సరంలో పశ్చిమబెంగాల్‌లో సగటున ఓ వ్యక్తి మద్యంపై కేవలం రూ.4మాత్రమే ఖర్చు చేశారు. దేశంలో జనాభా ఎక్కువ కలిగిన ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తి సగటున మద్యంపై ఏడాదిలో చేసిన ఖర్చు రూ.49 మాత్రమే ఆ తరువాత రాజస్థాన్ రూ.140, త్రిపుర రూ.148 ఖర్చు చేశాయి. మధ్యప్రదేశ్‌లో ఓ వ్యక్తి మద్యంపై సగటున ఖర్చుచేసిన మొత్తం రూ.197 కాగా, మహారాష్ట్రలో ఈ ఖర్చు రూ.346గా ఉంది. హర్యానాలో రూ.812 కాగా

## నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు

**(1వపేజీ తరువాయి)**పరీక్ష మొదటి సెషన్‌కు ఉదయం 8.30గంటల నుంచి, రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1.30గంటల లోపే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి స్తారు. ఉదయం సెషన్‌లో 9.30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌లో 2.30గంటలకు గేట్లు మూసివేస్తామని.. ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లో అనుమతించబోమని తేల్చి చెప్పారు. సెలక్షన్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను, క్వశ్చన్‌పేపర్లు జాగ్రత్త చేసుకో వాలని టీజీపీఎస్సీ సూచించింది. డూప్లికేట్ హాల్‌టికెట్లను తర్వాత జారీ చేయబోమని స్పష్టం చేసింది. తెలంగాణలో దాదాపు 1380కి పైగా గ్రూప్-3 పోస్టులకు 5.36 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.

## మయోనైజ్‌పై నిషేధం

**(1వపేజీ తరువాయి)**మయోనైజ్‌పై నిషేధం విధించాలని నిర్ణయించింది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో హెూటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కల్తీ ఆహారం తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మయోనైజ్‌ను ఎక్కువగా.. మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినా హెూటళ్లు తీరు మార్చుకోవట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది.

## టీటీడీ చైర్మన్‌గా బీఆర్ నాయుడు

**(1వపేజీ తరువాయి)**నరేశ్‌కుమార్,డా.అదిత్ దేశాయ్,శ్రీసౌరబ్ హెచ్ బోరా,కృష్ణమూర్తి,కోటేశ్వరరావు,దర్శన్. ఆర్.ఎన్,జస్టిస్ హెచ్‌ఎల్ దత్,శాంతారామ్,పి.రామ్మూర్తి,జానకీ దేవి తమ్మిశెట్టి,బూంగునూరు మహేందర్ రెడ్డి,అనుగోలు రంగశ్రీ

## జెత్వానీ కేసు.. విచారణ ప్రారంభించిన సీఐడీ

**(1వపేజీ తరువాయి)**జెత్వానీ, ఆమె తల్లిదండ్రుల నుంచి వాంగ్మూలం సేకరించారు. ఈ కేసులో ఇప్పటికే వైకాపా నేత కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. మరోవైపు వైకాపాతో అంటకాగి అక్రమ కేసులు బనాయించారనే ఆరోపణలపై ఇప్పటికే ఐపీఎస్ అధికారులు కాంతిరాణా టాటా, విశాల్ గున్నీ, పీఎస్ఆర్ ఆంజనేయులతో పాటు మరికొందరిపై కేసులు నమోదయ్యాయి. వారిని రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

## గోదావరి పుష్కరాల ముహూర్తం ఖరారు

**(1వపేజీ తరువాయి)**ప్రారంభం వేళ చోటు చేసుకున్న ఘటనలు విషాదం మిగుల్చాయి. ఈ సారి పుష్కరాల కోసం 8 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు. దీంతో గోదావరి జిల్లాల్లో పుష్కర ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో ప్రతిపాదలు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. సుమారు రెండున్నరేళ్ల కంటే ఎక్కువ సమయం ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటి నుంచే రంగంలోకి దిగారు. పుష్కర ఏర్పాట్ల పైన కీలక కసరత్తు చేసారు.

**నిధుల కేటాయింపు** అఖండ గోదావరి పుష్కరాలు-2027 ముసాయిదా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమైంది. అందరూ ఒకే ఘాట్‌లో స్నానాలు చేసే అవసరం లేకుండా గోదావరి నదిలో ఎక్కడైనా స్నానాలు చేయొచ్చని ప్రచారం చేయనున్నారు. ప్రస్తుతం ఉన్న 17 ఘాట్లకు రోజుకు 75,11,616 మంది వస్తారని అంచనా వేశారు. మరో నాలుగు కొత్త ఘాట్లు అవసరమని భావిస్తున్నారు. యాత్రికుల బస ఏర్పాట్లపై చర్చించారు. రాజమహేంద్రవరం పరిధిలో గోదావరి ఘాట్ల అభివృద్ధికి రూ.904 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. కార్పొరేషన్ రోడ్ల అభివృద్ధికి రూ.456.5 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు, బ్రిడ్జిల అభివృద్ధికి రూ.678.76 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. సిటీ బ్యూటిఫికేషన్, ఐకానిక్ టూరిజం సైట్ ప్రాజెక్టు కోసం రూ.75 కోట్లతో ప్రతిపాదించారు.

**ముందస్తు ఏర్పాట్లు**ఈసారి గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా తీసుకుని శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే రద్దీ, ట్రాఫిక్ నియంత్రణ, తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేస్తామని మంత్రులు చెబుతున్నారు. గోదావరి పుష్కరాలు 2047కు విజనరీతో ముందుకు వెళ్లనున్నారు. దీనికి సంబంధించిన నిధులను సమీకరించుకుని, సమగ్ర అభివృద్ధి యాక్షన్ ప్లాన్ రూపొందించనునున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో గోదావరి పుష్కరాల పైన ఉన్నత స్థాయి సమీక్ష జరగనుంది.

## ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్

**(1వపేజీ తరువాయి)**పరీక్షలను దృష్టిలో ఉంచుకొని గ్రూప్-2 మెయిన్స్ రాత పరీక్ష తేదీని ఖరారు చేసినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## గిరిజన బాలికకు మంత్రి కోమటిరెడ్డి చేయూత

**కౌడిపల్లి-నవభూమి:** ఎంబీబీఎస్ సీటు సాధించినా ఆర్థిక ఇబ్బందులతో చదువు కొనసాగించలేకపోతున్న ఓ గిరిజన విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చేయూతనందించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్ భద్యతండాకు చెందిన కాట్రోత్ శివ రాం, గంసీలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. రెండో కూతురు కాట్రోత్ సుమలత సిద్దిపేటలోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. కానీ డబ్బులేక కూలీ పనులకు వెళ్తోంది. ఈ విషయం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. బుధవారం సుమలత కుటుంబసభ్యులకు ఫోన్ చేసి మంత్రి కార్యాలయానికి పిలిపించి ఆమెకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం చేశారు.

## భారీగా తగ్గిన పెట్రో ధరలు

**(1వపేజీ తరువాయి)**ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గనున్నాయి. ఈ మార్పు కారణంగా దేశంలోని ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్ ఘర్ రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గనున్నాయి. ఒక రాష్ట్రానికి, మరో రాష్ట్రానికి డీలర్ కమీషన్‌లో తేడా ఉంటుంది. ఒక రాష్ట్రంలో కూడా ఒక్కో ప్రాంతంలో ఒక్కోలా ఈ డీలర్ కమీషన్ ఉంటుంది. అంతర్రాష్ట్ర సరుకు రవాణా హేతుబద్ధీకరణలో భాగంగా ఆయిల్ కంపెనీలు డీలర్ కమీషన్ పెంచడం గమనార్హం.

ఛత్తీస్ ఘర్, ఒడిశా, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గాయి. మహారాష్ట్ర, జారండ్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఈ రాష్ట్రాల్లో ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటామని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ చెప్పారు. ఒడిశాలోని కూనన్‌పల్లిలో పెట్రోల్ ధర లీటర్‌పై అత్యధికంగా 4 రూపాయల 69 పైసలు, లీటర్ డీజిల్‌పై రూ.4.45 పైసలు ధర తగ్గింది.

## కులగణనలో తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా మార్చాలి

**(1వపేజీ తరువాయి)**చేశారు.కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న సీఎం.. ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు.

కుల గణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బాధ్యతగా పనిచేయాలని కష్టానికి తగిన ఫలితం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా పార్టీ క్షమించదని హెచ్చరించారు. నవంబర్ 31లోగా ప్రక్రియ పూర్తి చేసి భవిష్యత్తు యుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని అది మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన తెలంగాణను మోడల్ గా పరిగణనలోకి తీసుకునేలా డాక్యుమెంటును కేంద్రానికి పంపుతామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది బీసీ కులగణన కాదు.. సమగ్ర కులగణన అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.

## 6 నుంచి తెలంగాణలో కులగణన

**(1వపేజీ తరువాయి)**ఈమేరకు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో తెలిసే అవకాశం ఉంది. త్వరలో దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు.

**భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుంది: భట్టి విక్రమార్క**

త్వరలో అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేస్తున్నామన్నారు. సర్వేతో అందరి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

## యూట్యూబర్ హర్షసాయికి ముందస్తు బెయిల్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**తెలుగు టాప్ యూట్యూబర్ హర్షసాయికి హైకోర్ట్ ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. తనపై పెట్టిన లైంగిక వేధింపుల కేసు చెల్లదని హర్ష హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.కాగా ఈ కేసులో బుధవారం ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ కోర్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడంటూ హర్షసాయిపై ఓ యువతి నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సదరు యువతి నుండి పలు ఆధారాలను సేకరించారు.అయితే కేసు నమోదు అయినప్పటి నుండి హర్ష పరారీలో ఉన్నాడు. సామాజిక మాధ్యమాల్లో హర్షసాయి తనని కించపరుస్తూ పోస్టులు పెట్టిస్తున్నాడు అంటూ యువతి మరోసారి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. ఈ కేసులో పోలీసులు పలువురిని ప్రశ్నించినప్పటికీ.. ఎలాంటి అరెస్టులు, విచారణలు జరగకుండా హర్ష నేడు హైకోర్టు నుండి ముందస్తు బెయిల్ పొందాడు.

## విచారణకు హాజరైన రాజ్

**(1వపేజీ తరువాయి)** పోలీసులు నోటీసులు జారీ చేశారు. పార్టీ కేసుకు సంబంధించి విచారించాల్సి ఉందని అందులో పేర్కొన్నారు.

జన్వాడలో ఫామ్‌హౌస్‌పై ఇటీవల సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేశారు. ఇక్కడి రిజర్వ్ కాలనీలో ఉన్న రాజ్ పాకాల ఫామ్‌హౌస్‌లో శనివారం రాత్రి పార్టీ నిర్వహించారు. భారీ శబ్దాలతో ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. 21 మంది పురుషులు, 14 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. 35 మందితో నిర్వాహకులు మద్యం పార్టీ నిర్వహించారు. డ్రగ్స్ పరీక్షలు నిర్వహించిన పోలీసులు.. రాజ్ పాకాల స్నేహితుడు విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధరించారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగానే రాజ్ పాకాలకు నోటీసులు ఇచ్చారు.

## ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయండి

**(1వపేజీ తరువాయి)**రిజర్వేషన్ల అమలుపై అధ్యయనం చేసే బాధ్యతను బీసీ కమిషన్‌కు అప్పగించడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు."ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది. ఇక్కడ నివేదిక సమర్పించిన తర్వాత అదేవిధంగా జరిగితే సమయం వృథా అవుతుంది. అందువల్ల ఇప్పుడే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలి" అని పిటిషనర్ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోర్టును కోరారు. పిటిషనర్ వాదనతో ఏకీభవించిన ధర్మాసనం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ గురువారం 31, అక్టోబర్, 2024

## పండుగలను బీజేపీ రాజకీయం చేస్తోంది.. అయోధ్య దీపోత్సవానికి ఆహ్వానించలేదు: అవధేష్ ప్రసాద్



**న్యూఢిల్లీ-నవభూమి:** పండుగలను బీజేపీ రాజకీయం చేస్తోందని ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాద్ ఎంపీ అవధేష్ ప్రసాద్ విమర్శించారు. స్థానిక ఎంపీ అయిన తనను అయోధ్య దీపోత్సవానికి ఆహ్వానించలేదని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ అయిన అవధేష్ ప్రసాద్ దీపోత్సవానికి వచ్చేందుకు సిద్ధంగా లేరన్న ఒక స్వామీజీ వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఆ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై మండిపడ్డారు. 'దీపావళి పండుగను బీజేపీ రాజకీయం చేస్తోంది. ప్రజలను విభజిస్తున్నది. దీపోత్సవ్ కార్యక్రమం కోసం నాకు ఎలాంటి పాస్ లేదా ఆహ్వానం అందలేదు. ఈ పండుగ ఏ ఒక్క వర్గానికో, పార్టీకో చెందినది కాదు. ఈ పండుగను అందరం కలిసి జరుపుకుంటాం. నాకు ఆహ్వానం అందకపోయినా అయోధ్యకు వెళ్తా' అని అన్నారు.కాగా, ఎంపీ అవధేష్ ప్రసాద్, దీపావళి సందర్భంగా అయోధ్య ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అయోధ్య ఉన్న ఫైజాబాద్ లోక్‌సభ స్థానం ప్రజలకు తాను ప్రాతినిధ్యం వహించడం గొప్ప అదృష్టమని చెప్పారు. 'మా పండుగలన్నింటినీ సోదర భావంతో మేం జరుపుకుంటాం. దురదృష్టవశాత్తు పండుగల పేరుతో ప్రజలను విభజించాలని, రాజకీయం చేయాలని బీజేపీ కోరుకుంటున్నది' అని విమర్శించారు.

## 25 రోజుల పసిబిడ్డను.. 30 వేలకు అమ్మిన తండ్రి



**గౌహతి-నవభూమి:** పేదరికంతో బాధపడుతున్న ఒక వ్యక్తి 25 రోజుల పసిబిడ్డను రూ.30,000కు అమ్మాడు.ఈ విషయం తెలుసుకున్న చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) వెంటనే స్పందించింది. ఒక డాక్టర్ ఇంటి నుంచి ఆ శిశువును అధికారులు రక్షించారు. అస్సాంలోని ధేమాజీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 4న దిబ్రూగఢ్‌లోని అస్సాం మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో ఒక మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే పేదరికం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తల్లిదండ్రులైన ధిమాన్ బోరా, సబితా బోరా ఆడ పిల్లను భారంగా భావించారు. శిశువును ఆ హాస్పిటల్‌లో వదిలి అక్కడి నుంచి పారిపోయారు.


%కాగా, చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఈ సమాచారం తెలిసింది. దీంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) దీనిపై స్పందించింది. శిశువు పేరెంట్స్‌ను గుర్తించి తమ వద్దకు రావాలని ఆదేశించింది. భయపడిన తల్లిదండ్రులు మెడికల్ కాలేజీ హాస్పిటల్ నుంచి ఆ శిశువును తిరిగి పొందారు. అయితే పెగు సోహెూరియా, ఆమె భర్తకు ఆ పసికందును రూ.30,000కు అమ్మేశారు.మరోవైపు చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఈ విషయం తెలిసింది. దీంతో సిలాపత్తర్‌లోని డాక్టర్ చంద్రజిత్ డోలే ఇంట్లో ఉన్న ఆ శిశువును రక్షించి స్వాధీనం చేసుకున్నారు. శిశువు విక్రయంలో బుబుల్ బోరా, దిలీప్ సైకియా కీలక పాత్ర ఉందని అధికారులు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భారత్‌లో ఫ్రాన్స్ రాయబారి ఫోన్ చోరీ.. నలుగురు అరెస్ట్




**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో ఫ్రాన్స్ రాయబారిథియెర్రీ మథవ్ కు షాకింగ్ అనుభవం ఎదురైంది. కుటుంబంతో దేశ రాజధాని ఢిల్లీలోని ఓ ప్రముఖ ప్రాంతంలో షాపింగ్‌కు వెళ్లిన సమయంలో ఆయన ఫోన్ చోరీకి గురైంది పాకెట్‌లో ఉన్న థియెర్రీ ఫోన్‌ను కొందరు వ్యక్తులు దొంగిలించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 20న థియెర్రీ తన భార్యతో కలిసి ఢిల్లీలోని ఫేమస్ చాందినీ చౌక్‌ఏరియాలో షాపింగ్‌కు వెళ్లారు. అక్కడ జైన్ మందిరం సమీపంలో ఆయన జేబులో ఉన్న మొబైల్ ఫోన్‌ను ఎవరో దొంగిలించారు. ఈ ఘటనపై థియెర్రీ ఆన్‌లైన్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మరుసటి రోజున అంటే అక్టోబర్ 21న ఫ్రాన్స్ రాయబార కార్యాలయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చాందినీ చౌక్ ప్రాంతంలో నిందితుల కోసం జల్లెడ పట్టారు.ఫోన్ దొంగతనం చేసింది నలుగురు వ్యక్తులని గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి ఫోన్‌ను రికవరీ చేశారు. నిందితులైన నలుగురి వయస్సు 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు వెల్లడించారు. వీరంతా యమునా నది ఒడ్డున ఉన్న ప్రాంతంలో నివసిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంద న్నారు. ఢిల్లీలోని ప్రముఖ ప్రాంతాల్లో ఒకటైన చాందినీ చౌక్‌లో ఓ దేశ రాయబారి ఫోన్ చోరీకి గురి కావడం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.

## దివాళీ వేడుకల్లో హిందీ హిట్ పాటకు డ్యాన్స్ చేసిన యూఎస్ దౌత్యవేత్త..



**న్యూఢిల్లీ-నవభూమి:** భారత్‌లో అమెరికా రాయబారిగా ఉన్న ఎరిక్ గార్సెట్టి మరోసారి తన డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయంలో బుధవారం దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గార్సెట్టి స్టేజ్‌పై బాలీవుడ్ హిట్ పాటకు ఎంతో ఉత్సాహంగా కాలు కదిపారు.విక్కీ కౌశల్ నటించిన 'బ్యాడ్ న్యూజ్' చిత్రంలోని 'తౌబా తౌబా..' అని సాగే హిట్ పాటకు ఎంతో ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. సంప్రదాయ కుర్తా పైజామా ధరించి, కళ్లజోడు పెట్టుకుని గార్సెట్టి చేసిన డ్యాన్స్ వీడియో ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. గార్సెట్టి ఇలా తన డ్యాన్స్ స్కిల్స్‌తో ఆకట్టుకోవడం ఇదేమీ మొదటి సారి కాదు. గతంలో కూడా చాలా సందర్భాల్లో ఇలా తన నృత్య ప్రదర్శనతో అందరిని ఆకట్టుకున్నారు.

## చెన్నైలో కుండపోత వర్షం.. నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు..



**చెన్నై -నవభూమి:** తమిళనాడు రాజధాని చెన్నై లో కుంభవృష్టి కురిసింది. ఒక్కసారిగా కుండపోత వర్షం పడటంతో లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. పలు కాలనీలు చెరువుల్లా మారిపోయాయి. రహదారులు నదులను తలపించాయి. దాంతో జనజీవనం స్తంభించిపోయింది. ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.భారీ వర్షం కారణంగా వరద పోటెత్తడంతో పలుచోట్ల పార్క్ చేసి ఉన్న వాహనాలు కొట్టుకుపోయాయి. నాలాలు పొంగిపొర్లుతున్నాయి. దాంతో చెన్నై నగరపాలక సంస్థ అధికారులు రంగంలోకి దిగారు. విపత్తును ఎదుర్కొనే చర్యలు చేపట్టారు. వరద కారణంగా ఎక్కడా ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టారు. గిండి ఏరియాలో కుండపోత వర్షం కురుస్తున్న దృశ్యాలను కింది వీడియోలో మీరు కూడా చూడవచ్చు.

# రూ.50 కోట్లు కట్నం అడిగిన ఎయిమ్స్ టాపర్?...



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆడపిల్లను ఎంతో అపురూపంగా పెంచుకున్న తల్లితండ్రులు.. ఎంతో డబ్బు దారపోసి ఉన్నత చదువులు చదివించి, ఆమె కాళ్లపై ఆమె నిలబడేలా చేసినా కూడా.. తిరిగి ఆమెకు పెళ్లి చేసే సమయానికి మరో భారీ భారం వచ్చి పడుతుంది! అదే... "కట్నం" అనే మహమ్మారి! తాజాగా ఈ విషయంలో ఓ వైద్యురాలి పరిస్థితిని తన స్నేహితులొకరు ఆన్ లైన్ వేదికగా పంచుకున్నారు. తమలపాకులో పెట్టి తాంబూలం అన్నా.. డిమాండ్ మీద ఇవ్వాల్సి వచ్చిన బహుమతి / కానుక అని కవర్ చేసినా.. వరకట్న సమస్య మాత్రం భారతదేశాన్ని ఇంకా పట్టి పీడిస్తూనే ఉంది. దౌర్భాగ్యకరమైన విషయం ఏమిటంటే... ఉన్నత చదువులు చదువుకున్నవారు, సమాజంలో గొప్ప గొప్ప స్థానాలో ఉన్నవారు సైతం ఇలాంటి పనులకు పాల్పడుతున్నే ఉన్నారు. ఈ సమయంలో... ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కి చెందిన ఓ టాపర్.. రూ.50 కోట్ల కట్నం డిమాండ్ చేయడంతో తన స్నేహితురాలి గుండె పగిలిపోయిందని బెంగళూరుకు చెందిన ఓ మహిళా డాక్టర్ సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. ఈ విషయమై తన స్నేహితురాలు ఆవేదనంతో తనతో పంచుకుందని వెల్లడించింది! ఈ క్రమంలో... ఎయిమ్స్ ఎంట్రన్స్ లో టాప్ ర్యాంక్ సాధించిన ఓ వ్యక్తితో తన స్నేహితురాలు వివాహ ప్రతిపాదన కోసం చూస్తున్నట్లు సదరు మహిళా డాక్టర్ చెప్పారు. తన స్నేహితురాలు కూడా వైద్యురాలే అని.. ఆమె ప్రస్తుతం అనస్థీషియాలో ఎండీ చదువుతున్నారని.. హైదరాబాద్ లో లివర్ మార్పిడి అనస్థీషియాలో ఫెలోషిప్ తో మరింత నైపుణ్యం పొందుతున్నారని తెలిపారు. %ూశ్రీంశీ =ఘు% - హంగులతో మెట్రో 2 దశ.. ఫ్లాట్ ఫాంలు.. కోచ్ లు.. అన్నీ సరికొత్తగా! ఈ క్రమంలో తోటి డాక్టర్ ను పెళ్లి చేసుకునేందుకు ఎయిమ్స్ టాప్ ర్యాంకర్ ఒకరు రూ.50 కోట్లు డిమాండ్ చేయడమా అని నిలదీశారు. ఈ సమయంలో... రూ.50 కోట్లు అంటే తన తల్లితండ్రులు జీవితమంతా పోదుపుచేసిన మొత్తం అవుతుందని ఆమె స్నేహితురాలు గంటల తరబడి ఏడుస్తూనే ఉందని.. తర్వాత ఆమె చెల్లి భవిష్యత్తు ఏమిటని ఆవేదన వ్యక్తం చేసిందని తెలిపారు. ఇదే సమయంలో.. తెలుగు సమాజంలో ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే భారీగా కట్నం అవసరమనే విషయాన్ని తన స్నేహితురాలి తల్లితండ్రులు అంగీకరించారని ఆమె వెల్లడించారు! ప్రస్తుతం ఈ విషయం నెట్టింట వైరల్ గా మారింది. ఈ సమయంలో.. సదరు టాపర్ తీరును నెటిజన్లు తప్పు పడుతున్నారు. ఒక వైద్యుడు తన కాళ్లపై తాను నిలబడే దమ్ము లేని ఈ విద్య ఎందుకంటూ కామెంట్లు చేస్తున్నారు!

## ఆ రెండు పార్టీలు నన్ను వ్యతిరేకించినా నష్టం లేదు.. గెలుపు నాదే : నవాబ్ మాలిక్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఆ రెండు పార్టీలు నన్ను వ్యతిరేకించినా నష్టం లేదు.. గెలుపు నాదే : నవాబ్ మాలిక్ అన్నారు.

మహారాష్ట్రలోని మాన్‌ఖుర్ద్ శివాజీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్సీపీ (అజిత్‌పవార్ వర్గం) అభ్యర్థిగా బరిలో దిగుతున్న నవాబ్ మాలిక్ తరఫున ప్రచారం చేసేందుకు బీజేపీ నిరాకరిచడంపై ఆయన స్పందించారు. అదే నియోజకవర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన.. సురేశ్ పాటిల్ అనే అభ్యర్థిని బరిలో దించడాన్ని మాలిక్ తప్పుపట్టారు. బీజేపీ, శివసేన తనను వ్యతిరేకించినా తనకు అభ్యంతరం లేదని, తాను భారీ మెజారిటీతో గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

'మాన్‌ఖుర్ద్ శివాజీనగర్ నియోజకవర్గం నుంచి అజిత్‌పవార్ నన్ను బరిలో దించినప్పటికీ ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన సురేష్ పాటిల్ అనే అభ్యర్థిని పోటీకి పెట్టిందని, బీజేపీ కూడా పాటిల్‌కు మద్దతు తెలుపుతోంది. నా కుమార్తె బరిలో దిగుతున్న నియోజకవర్గంలో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. అయితే శివసేన, బీజేపీ వ్యతిరేకించినా మాకు వచ్చిన నష్టమేం లేదు. రెండు నియోవజకవర్గాల్లో మేం భారీ మెజారిటీతో విజయం సాధిస్తాం. ఇలా జరుగుతుందని నేను ముందే ఊహించా' అని నవాబ్ మాలిక్ అన్నారు.కాగా, మాన్‌ఖుర్ద్ శివాజీ నగర్ నుంచి నవాబ్ మాలిక్‌ను బరిలో దించడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఆయన తరఫున తాము ప్రచారమే చేయమని తెగేసి చెప్పింది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమిలో బీజేపీ, ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన, అజిత్‌పవార్ వర్గం ఎన్సీపీ ప్రధాన భాగస్వాములుగా ఉన్నాయి. ఈ క్రమంలో అజిత్ పవార్ వర్గం ఎన్సీపీ అభ్యర్థిపై ఏక్‌నాథ్ శివసేన తన అభ్యర్థిని పోటీకి పెట్టడం, అందుకు బీజేపీ కూడా మద్దతు పలుకడం మహాయుతిలో లుకలుకలను బయటపెడుతోంది.

## ఇది దీపాల పండుగ.. పటాసుల పండుగ కాదు : అర్వింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ-నవభూమి:** దీపావళి పండుగ అంటే దీపాలు వెలిగించి జరుపుకునే పండుగ అని, పటాసులు కాల్చే పండుగ కాదని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. ఈ పండుగ సందర్భంగా ఎవరూ పటాసులు కాల్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని ఆయన చెప్పారు. పటాకులు కాల్చవద్దని, దీపాలు వెలిగించాలని సుప్రీంకోర్టు హైకోర్టు కూడా చెబుతున్నాయని ఆయన గుర్తుచేశారు.


ూడా పటాసులు కాల్చవద్దని, దీపాలు వెలిగించాలని సూచిస్తున్నాయి. ఇది దీపాలు వెలిగించే పండుగ, పటాసుల పండుగ కాదు. పటాసులు కాల్చవద్దని చెప్పడం అంటే ఎవరికో అనుకూలంగా మాట్లాడినట్టు కాదు. కాలుష్యం పెరిగితే మన పిల్లల ఆరోగ్యాలు చెడిపోతాయి. ఇందులో హిందూ, ముస్లిం ఆలోచన లేదు. ప్రతి ఒక్కరికీ వారి జీవితం ముఖ్యం' అని అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు.

## రైలు పట్టాలపై డిటోనేటర్లు ఉంచిన వ్యక్తి.. తర్వాత ఏం జరిగిందంటే?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక వ్యక్తి రైలు పట్టాలపై డిటోనేటర్లు ఉంచాడు. రైల్వే కంట్రోల్ డివిజన్ నుంచి ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ)కు ఈ సమాచారం అందింది. వారు వెంటనే అక్కడకు చేరుకుని పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి నిందితుడ్ని గుర్తించారు. అతడ్ని అరెస్ట్ చేయడంతోపాటు మరి కొన్ని డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరాఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. హరిద్వార్-డెహ్రాడూన్ రైల్వే ట్రాక్‌పై డిటోనేటర్లు ఉన్నట్లు ఆదివారం రాత్రి మొరాదాబాద్ రైల్వే డివిజన్ కంట్రోల్ రూమ్‌కు తెలిసింది. దీంతో హరిద్వార్ ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీపీ)కు సమాచారం ఇచ్చారు.కాగా, జీఆర్పీ బృందం వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైలు పట్టాల వద్ద ఉన్న డిటోనేటర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. అక్కడ అనుమానాస్పదంగా ఒక వ్యక్తి తిరుగడాన్ని గమనించారు. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌కు చెందిన అశోక్‌గా నిందితుడ్ని గుర్తించారు. మంగళవారం అతడ్ని అరెస్ట్ చేశారు. అతడి వద్ద ఉన్న పలు డిటోనేటర్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పేలుడు పదార్థాలను రైలు పట్టాలపై ఎందుకు ఉంచాడన్న దానిపై నిందితుడ్ని పశ్నించనున్నారు.

## బెంగళూరు కేంద్ర కారాగారం నుంచి విడుదలైన నటుడు దర్శన్



**న్యూఢిల్లీ-నవభూమి:** కన్నడ నటుడు దర్శన్ జైలు నుంచి బయటకు వచ్చారు. అభిమాని రేణుకాస్వామి హత్యకేసులో .. కర్ణాటక హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కోర్టు తీర్పుతో దాదాపు నాలుగు నెలల తర్వాత ఆయన జైలునుంచి విడుదలయ్యారు.కాగా రేణుకాస్వామి హత్య కేసులో దర్శన్‌తోపాటు నటి పవిత్రగౌడ సహా 16మందిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పవిత్ర గౌడకు సంబంధించిన అసభ్యకర ఫొటోలు పంపించాడన్న ఆరోపణల్లో దర్శన్ అండ్ టీం రేణుకాస్వామిని బెంగళూరుకు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న చిత్రదుర్గకు తీసుకెళ్లి దారుణంగా హత్య చేసిందని విచారణలో తేలింది. పవిత్ర గౌడకు అసభ్యకరమైన సందేశాలు పంపాడన్న కారణంతో రేణుకా స్వామిని దారుణంగా కొట్టి, కరెంటు షాక్‌లు ఇచ్చినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. శరీరంపై అనేక గాయాలను కూడా గుర్తించారు. వీరంతా ప్రస్తుతం బెంగళూరులోని వివిధ జైళ్లలో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

# లండన్‌లో జున్ను దొంగలు.. ఎన్ని కోట్ల విలువో తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:** కాదేదీ కన్నానికి అనర్హం అని నిరూపించే ప్రయత్నంలో కేటుగాళ్లు ఎప్పుడూ బిజీగా ఉంటుంటారు! అదేదో సినిమాలో చూపించినట్లు అపార్ట్ మెంట్ లో గుమ్మాల ముందు ఉన్న పాల ప్యాకెట్లు, న్యూస్ పేపర్లు ఎత్తుకెళ్లినట్టుగా అన్నట్లు జున్ను కాజేశారు. దాని విలువ రూ. 3 కోట్లకు పైమాటే అని అంటున్నారు. లండన్ లో కొందరు కేటుగాళ్లు భారీ ఎత్తున జున్ను ఎత్తుకెళ్లిన ఘటన తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా... హెూల్ సేల్ డిస్ట్రిబ్యూటర్లుగా అవతారమెత్తినా వాళ్లు.. ఏకంగా 22 టన్నుల జున్ను కాజేశారు. దీని విలువ రూ.3 కోట్లకు పైమాటే అని తెలుస్తోంది. దీంతో... ఈ విషయం అటు స్థానికంగానూ, ఇటు నెట్టింట్లోనూ వైరల్ గా మారింది.లండన్ లోని ప్రముఖ చెద్దర్ డెయిరీ జున్ను ఉత్పత్తులకు బాగా ఫేమస్ అయ్యింది. ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ తయారు చేసే ఇక్కడి జున్నుకు ఫుల్ డిమాండ్ ఉంటుందని చెబుతుంటారు. ప్రపంచంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన ఈ డెయిరీ నాణ్యతలో పలు అవార్డులను కూడా సొంతం చేసుకుంది. బ్రిటన్ లోని ప్రముఖ చెఫ్ జామీ ఆలివర్ బాధ్యత వహిస్తున్న ఈ జున్ను ధర కూడా ఎక్కువగానే ఉంటుందని చెబుతారు. ఈ నేపథ్యంలో ఈ జున్ను చోరీకి కొందరు కలిసి పెద్ద ప్లానే వేశారట. ఇందులో భాగంగా... ఫ్రెంచ్ రిటైల్ హెూల్ సేల్ డిస్ట్రిబ్యూటర్లుగా చెప్పుకొని ఈ మోసానికి పాల్పడినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా యాజమాన్యాన్ని నమ్మించి సుమారు 22 టన్నుల జున్ను తీసుకెళ్లారు. అయితే... అది గమ్యస్థానానికి చేరకపోవడంతో ఆరాతీసిన డెయిరీ యాజమాన్యానికి జరిగిన మోసం తెలిసిందని అంటున్నారు. దీంతో.. ఈ విషయాన్ని ఇన్ స్టాలో పంచుకున్న జామీ ఆలివర్... తన కోటికి పైగా ఉన్న తన ఫాలోవర్ల సాయం కోరారు.

## ఈ -కార్ రేసింగ్ ఉచ్చులో కేటీఆర్.. దేనినీ వదలబోమంటున్న కాంగ్రెస్



**హైదరాబాద్-నవభూమి:** పదేళ్ల పాటు తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంది. దాంతో వారి పాలనలో ఎన్నో పథకాలు, మరెన్నో కార్యక్రమాలు చేపట్టారు. అయితే.. బీఆర్ఎస్ పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టాక పరిస్థితులు ఒక్కసారిగా తలకిందుల య్యాయి. బీఆర్ఎస్ పార్టీకి గడ్డు కాలం వచ్చేసింది. గతంలో అమలు చేసిన పథకాలపై, చేపట్టిన కార్యక్రమాల్లో జరిగిన అవకతవకాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టుపై రిటైర్డ్ జస్టిస్‌తో విచారణ నడుస్తోంది. అటు జీఎస్టీపైనా సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. వీటితోపాటే గొర్రెల స్కీమ్, తదితర పథకాలపైనా విచారణ కొనసాగుతోంది. తాజా గా.. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లోనూ గోల్ మాల్ జరిగినట్లు ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఇప్పుడు కేటీఆర్ మెడకు ఈ వివాదం చుట్టుకోనున్నట్లు తెలుస్తోంది. . ఎందుకు ఈ సోది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఫార్ములా ఈ-కారు రేసింగ్ వివాదాన్ని వెలికితీసింది. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే రూ.55 కోట్లను ఈ-కారు రేసింగ్ నిర్వహణ సంస్థకు కేటాయించినట్లుగా వెల్లడైంది. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టారు. దీంతో అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్ ప్రమేయం ఇందులో ఉన్నట్లుగా నిర్ధారణ అయింది. వెంటనే ఆయనను మున్సిపల్ శాఖ నుంచి బదిలీ చేసి విపత్తుల శాఖకు మార్చారు. అయితే.. ఆరు నెలలుగా ఈ వివాదాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు.ఇన్నాళ్లు సైలెంటుగా ఉన్న వివాదం ఇప్పుడు ఒక్కసారిగా తెరమీదకు వచ్చింది. ఈ-కారు రేసులో నిధుల గోల్‌మాల్ జరిగిందంటూ మున్సిపల్ శాఖ తాజాగా ఏసీబీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఒకటి రెండు రోజుల్లోనే ఏసీబీ రంగంలోకి దిగబోతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఈ విచారణలో ఏం జరగబోతోందా అన్న ఆసక్తి అందరిలోనూ కనిపిస్తోంది. మరోవైపు.. ఈ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో ఎవరు టార్గెట్ అవుతారన్న చర్చ సైతం నడుస్తోంది. గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. కేటీఆర్ ఫోన్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకే తాను ఈ కారు రేసింగ్ నిర్వహణ సంస్థకు రూ.55 కోట్లు ఇచ్చినట్లు ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ నోట్ ఫైల్‌లో రాసినట్లు సమాచారం. ఏసీబీ విచారణ సందర్భంగా అధికారి ఇదే విషయాన్ని చెప్పే అవకాశం ఉంది. ఆయన వాంగ్మూలం ఆధారంగా ఏసీబీ అధికారులు ఆ తరువాత కేటీఆర్‌ను విచారించే అవకాశాలు ఉన్నాయి. అయితే.. ఈ నిధులు ఇచ్చే సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కోడ్ సైతం అమలులో ఉంది. అయినప్పటికీ నిధులు ఇవ్వడంపై ఈ వివాదం ఎవరి మెడకు చుట్టుకుంటుందా అన్న ఆసక్తి, ఉత్కంఠ రెండూ కనిపిస్తున్నాయి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ | గురువారం | 31 । అక్టోబర్ । 2024



## గూగుల్‌లో 25 శాతం కోడింగ్ 'ఏఐ'తోనే: సుందర్ పిచాయ్



గూగుల్ తన సాఫ్ట్‌వేర్ కోడ్‌ను రూపొందించడానికి కృత్రిమ మేధపై ఎక్కువగా ఆధారపడుతోందని కంపెనీ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. జనరేట్ చేసిన కోడ్‌ను ఇంజినీర్లు రివ్యూ చేస్తున్నప్పటికీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం పెరిగిందన్నారు. గూగుల్ మూడో త్రైమాసిక ఫలితాలను ప్రకటించిన సందర్భంగా పిచాయ్ ఏఐ గురించి ఆసక్తికర విషయాలను తన బ్లాగ్ పోస్ట్‌లో పంచుకున్నారు.గూగుల్ మెరుగైన వృద్ధి వ్యూహంలో ఏఐది కీలక పాత్ర అని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. 'గూగుల్‌లో కొత్త కోడింగ్‌లో 25 శాతానికిపైగా కృత్రిమ మేధతోనే సృష్టిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏఐ సాయంతో కోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం ద్వారా.. సమయాన్ని తగ్గించి, ఆవిష్కరణల విషయంలో వేగం పెంచడమే సంస్థ లక్ష్యమని వెల్లడించారు. 'కృత్రిమ మేధ ఆధారిత కోడింగ్ ప్రక్రియ అనేది.. సంస్థ కార్యకలాపాల క్రమబద్ధీకరణలో ఓ భాగం. జెమినీ వంటి కొత్త మోడళ్లను మరింత వేగంగా తీసుకొచ్చేలా.. పరిశోధన, మెషిన్ లెర్నింగ్, సెక్యూరిటీ విభాగాలతోపాటు ఆయా ప్లాట్‌ఫామ్, డివైస్‌లకు చెందిన సిబ్బందిని ఏకీకృతం చేసింది' అని ఆయన తెలిపారు.



## అమెరికా మాయ!

ప్రపంచంలోనే అత్యంత ప్రమాదకరమైన దేశం అంటూ పాకిస్థాన్‌ను అమెరికా అధ్యక్షుడు బైడెన్ అభివర్ణించిన నాలుగురోజుల్లోనే, దాదాపు నాలుగేళ్ళ తరువాత ఎఫ్‌ఎటీఎఫ్ గ్రే లిస్టునుంచి పాకిస్థాన్ బయటపడిపోయింది. ఉగ్రవాదులకు నిధుల సమకూర్చడం, మనీలాండరింగ్ వంటి నేరాలను అరికట్టకుండా ఉగ్రవాదానికి ఇతోధికంగా తోడ్పటం వంటి చర్యల వల్ల 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్' ఆంక్షల్లో ఉంటూ, అంతర్జాతీయంగా ఎటువంటి ఆర్థిక సహాయం అందని స్థితిలో పాకిస్థాన్ మిగిలిపోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ గ్రే లిస్టునుంచి బయటకు వచ్చిందంటే, పాకిస్థాన్ సంతృప్తికరమైన స్థాయిలో ఉగ్రవాద వ్యతిరేక చర్యలు తీసుకుందని అగ్రరాజ్యం విశ్వసించినట్టే. అణ్వాయుధాలు ఉగ్రవాదుల చేతుల్లోకి పోతాయని ఒకపక్క అంటూనే, పాకిస్థాన్‌ను కాపాడుకురావడం అమెరికాకు కొత్తేమీ కాదు.

బైడెన్ వ్యాఖ్యలకు కొద్దివారాల ముందే, పాకిస్థాన్‌కు తాను సరఫరా చేస్తున్న ఎఫ్ 16 విమానాల సామర్థ్యాన్ని మరింత పెంచే పేరిట ఓ నలభైఐదుకోట్ల డాలర్ల ఆర్థిక సహాయాన్ని అమెరికా ప్రకటించింది. యుద్ధ విమానాల మరమ్మతు, విడిభాగాల సరఫరా, అత్యాధునిక సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌తో వాటిని బలోపేతం చేసేందుకు ఈ సహాయం ఉపకరిస్తుంది. అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం మీద భారతదేశం ఆందోళన వ్యక్తం చేసినప్పుడు, ఈ యుద్ధవిమానాలను ఉగ్రవాదంపై పోరాటానికే పాకిస్థాన్ వాడుతుందని అమెరికా సమాధానం చెప్పింది. ఈ విమానాలను అమ్ముతున్నప్పుడు, మిగతా ప్రపంచాన్ని మోసం చేయడానికి విధించిన నిబంధనే తప్ప, దానిని పాకిస్థాన్ ఎన్నడూ పాటించలేదు. భారత విదేశాంగమంత్రి జయశంకర్ పదిరోజుల అమెరికా పర్యటన సందర్భంలో ఎవరిని వెర్రివాళ్లను చేస్తున్నారంటూ దీనిపై ఘాటుగా స్పందించారు కూడా. ఏ దేశమైనా ఎఫ్ 16 వంటి అగ్రస్థాయి యుద్ధవిమానాలను ఎందుకు వినియోగిస్తుందో అందరికీ తెలిసినా, ఇటువంటి మాయమాటలు చెప్పడం అమెరికాకే చెల్లుతుందని అన్నారాయన. అమెరికా పాకిస్థాన్ సంబంధాలు ఉభయదేశాలకూ పూర్తిగా ఉపకరించని రీతిలో ఉంటాయన్నారు ఆయన. తాలిబాన్, హక్కానీ నెట్ వర్క్ వంటి సంస్థలకు సహాయపడుతున్నదంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ పాకిస్థాన్‌కు సైనిక సాయాన్ని నిలిపివేస్తే, బైడెన్ ఇప్పుడు దానిని రద్దుచేసి, ఉగ్రవాదంమీద పోరుకే ఈ సాయం అని చెబుతున్నారు. జయశంకర్ వ్యాఖ్యల నేపథ్యంలో, భారత్, పాకిస్థాన్‌లు రెండూ తమకు మిత్రదేశాలేననీ, వేర్వేరు ప్రాతిపదికలమీద ఈ రెండు దేశాలతోనూ తమ మైత్రి కొనసాగుతూ ఉంటుందని అమెరికా తేల్చేసిన విషయం తెలిసిందే. ఎఫ్ 16 విమానాలవల్ల పాకిస్థాన్ యుద్ధ బలం పెరుగుతుందన్న విషయం అమెరికాకు తెలుసు. ఇటీవలి కాలంలోనే, బాలాకోట్ దాడుల నేపథ్యంలో, వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పాకిస్థాన్ కు చిక్కినప్పుడు ఎఫ్ 16కు ధీటైన జవాబు ఇవ్వగలిగే రాఫెల్ వంటి యుద్ధవిమానాలు మనకూ ఉండివుంటే బాగుండేదని ప్రధాని వ్యాఖ్యానించారు కూడా.పాకిస్థాన్ ను గ్రే లిస్టులో చేర్చడానికి, 2018 నుంచి అందులోనే కొనసాగడానికీ భారతదేశం ఒత్తిడి ఒక కారణం. ఇప్పుడు అది బయటకు రావడం వెనుక అమెరికా చొరవ లేదని ఎవరూ అనుకోరు. అమెరికా వ్యతిరేకి ఇమ్రాన్ ఖాన్ అక్కడ తిరిగి అధికారంలోకి వచ్చే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో ఆయనపై ఎన్నికల సంఘం వేటువేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రభుత్వం తీవ్ర ఆర్థిక కష్టాలతో మరింత అప్రదిష్టపాలవుతున్న స్థితిలో, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల సహాయానికి ఎఫ్‌ఏటీఎఫ్ నిర్ణయం వీలుకల్పిస్తుంది. ఎఫ్‌ఏటీఎఫ్ సమావేశాలకు ముందు లష్కరే తోయిబా అధినేత హాఫీజ్ సయీద్, ముంబై దాడుల ప్రధాన బాధ్యుడు సాజిద్ మీర్ వంటివారి అరెస్టులు చూపించి, జాబితానుంచి బయటకు వచ్చినా ఉగ్రవాదాన్ని నిరోధించే విషయంలో పాక్ సంకల్పబలం ఏపాటిదో దాని చరిత్రే చెబుతున్నది. ప్రస్తుతానికి సుషుప్తావస్థలో ఉన్న అనేక ఉగ్రవాద సంస్థలు అక్కడ ఉన్నందున, భారతదేశం ప్రపంచ వేదికలమీద తన ఒత్తిడి కొనసాగించక తప్పదు. గ్రే లిస్టునుంచి పాకిస్థాన్ బయటకు రావడం, ఆ దేశానికి అమెరికా తిరిగి సైనిక సాయం ఆరంభించడం, భారత్ అమెరికా సంబంధాల్లో పెద్ద అపశ్రుతి.

# రోడ్డు ప్రమాదాలను ఆపడం ఎలా?



దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలలో సగటున ప్రతీ గంటకు 53 ప్రమాదాలలో 19 మంది ప్రాణాలు కోల్పోతున్నారు. స్టాక్‌హోమ్ డిక్లరేషన్ ప్రకారం భారత ప్రభుత్వం 2030 నాటికి రోడ్డు మరణాలు, గాయాలను 50% తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రయోజనం కోసం రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ 4ఇ విధానాన్ని ప్రవేశపెట్టింది. అవి ఎడ్యుకేషన్ (రహదారి విద్య),ఇంజనీరింగ్ (రోడ్ల నిర్మాణంలో సాంకేతికత ), ఎన్ఫోర్స్మెంట్ (విధానాలు అమలు చేయడం ), ఎమర్జెన్సీ కేర్ (అత్యవసర సంరక్షణ). దీని ప్రకారం కేంద్ర మంత్రిత్వ శాఖ వివిధ కార్యక్రమాలు చేపట్టింది. మనదేశంలో అన్ని రహదారులు కలిపి 63.31లక్షల కిలోమీటర్ల పొడవుతో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద రోడ్డు వ్యవస్థగా ఉంది.

ఈ యేడాదిలోనే గరిష్ఠ ప్రమాదాలు:

జాతీయ రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం 2022 సం.లో 4,61,312 రోడ్డు ప్రమాదాలలో 1,68,491 మంది ప్రాణాలు కోల్పోగా 4,43,366 మంది గాయాలపాలయ్యారు. 2021 కంటే 2022లో పెరిగిన శాతం వరసగా 11.9 శాతం, 9.4 శాతం, 15.3 శాతంగా ఉంది. మొత్తం ప్రమాదాలలో 33.80 శాతం మంది అక్కడికక్కడే ప్రాణాలు వదులుతున్నారు. ఇందులో గుర్తు తెలియని వాహనాల వలనే అత్యధికంగా 30,486 ( 18.10% ) మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక లక్ష జనాభాకు జరుగుతున్న ప్రమాదాల సంఖ్య 2021 సం.లో 30.3 ఉండగా 2022 సం. వచ్చేసరికి ఇది 33.5 కి పెరిగింది. 100 ప్రమాదాలలో ఎంత మంది



చనిపోయారో తెలియజేసే సంఖ్యని రోడ్డు ప్రమాద తీవ్రత అంటారు. ఇది 2021 సం.లో 37.3 గా ఉంటే 2022 సం. వచ్చేసరికి 36.5 కి తగ్గింది. ఈ సంఖ్య అత్యధికంగా మిజోరాం (85), బీహార్ (82.4) , పంజాబ్ (77.50) గా ఉంది. మధ్యప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణా రాష్ట్రాలలో ఈ తీవ్రత జాతీయ సగటు 36.5 కంటే తక్కువగానే ఉంది. దేశసగటు కంటే ఎక్కువగా ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వాహనాల సంఖ్య పెరిగిపోతుండటంతో ప్రమాదాలు, మరణాలు ఎక్కువగుచున్నాయి. మొత్తం రహదారుల్లో జాతీయ, రాష్ట్ర రహదారుల వాటా కేవలం 5 శాతమే అయినప్పటికీ మొత్తం ప్రమాదాలలో 56.1 శాతం ఈ రెండు రహదారుల్లో జరగడం గమనార్హం.

**ప్రమాదాలు ఎక్కువగా జరిగే రాష్ట్రాలు :**

దేశంలో 2022 లో జరిగిన ప్రమాదాలలో తమిళనాడు 18,972 ( 12.5 %) మొదటి స్థానంలో ఉండగా, కేరళ 17,627 (11.6 % ), ఉత్తరప్రదేశ్ 14990 ( 9.9 %), మధ్యప్రదేశ్ 13860 ( 9.1 % ), కర్ణాటక 13384 ( 8.8 % ) తరువాత నాలుగు స్థానాల్లో ఉన్నాయి. మన తెలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ 8650 ( 5.7 % ), తెలంగాణా 7505 ( 4.9 % ) తో వరుసగా 7వ, 8వ స్థానాలలో ఉన్నాయి.

ప్రధాన కారణాలు

ప్రమాదాలకు కారణాలలో మొదటిది అతి వేగం. ఇది 1,19,904 ప్రాణాలను తీసింది. మద్యం తాగి వాహనం నడపడం లేదా మాదక ద్రవ్యాల వినియోగం 4,201, రాంగ్ రూట్ డ్రైవింగ్ 9,094, సిగ్నల్ జంపింగ్ 1,462, మొబైల్ ఫోన్ వాడకం 3,395 ప్రాణాలు తీశాయి. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టుకోపోవడం, మైనర్లు డ్రైవింగ్ వంటి కారణాలుతో పాటుగా గతుకులతో కూడిన రహదారులు కూడా మరో ప్రధానమైన కారణం. ఇంకా పాదాచారుల నిర్లక్ష్యం, వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, రోడ్డు నిర్మాణంలో లోపాలు, నిద్ర లేకుండా సుదీర్ఘంగా వాహనాలను నడపడం, కాలం చెల్లిన భద్రతా ప్రమాణాలు లేని వాహనాలలో ప్రయాణం చేయడం, అర్ధరాత్రి తరువాత కూడా వాహనాలు నడపడం, ట్రాఫిక్ చిహ్నాలపై అవగాహన లేకపోవడం, వయస్సు మళ్ళిన వారు డ్రైవింగ్ చేయడం, నో పార్కింగ్ జోన్లలో వాహనాలు నిలపడంతో పాటుగా స్పీడ్ బ్రేకర్స్ మీద తెలుపు చారలు గుర్తించక పోవడం, మలుపుల దగ్గర సైన్ బోర్డు ఏర్పాటు చేయక పోవడం వంటివి కూడా ఇతర కారణాలు.

**ప్రమాదాల వలన నష్టాలు:**

కుటుంబ యజమాని మృత్యువాత పడితే ఆ కుటుంబాలు వీధిన పడతారు. నైపుణ్యం గల వారు చనిపోతే వారి సేవలు లభించక దేశ జి.డి.పి పై ప్రభావం పడుతుంది. సరుకులతో వెళ్తున్న వాహనాలు ప్రమాదానికి గురైతే యాజమానులు ఆర్థికంగా నష్టపోతారు. వాహనాలు పనికిరాకుండా పోతాయి. బీమా సంస్థలకు కూడా ఎంతో నష్టం వాటిల్లుతుంది.

పరిష్కారాలు:

అతివేగంగా వాహనాలు నడుపరాదు. బ్లూటూత్స్, మొబైల్ వాడుతూ డ్రైవింగ్ చేయరాదు. రాత్రిపూట రోడ్డుపై వాహనాలు నిలుపరాదు. తెల్లవారు జామున వాహనాలు డ్రైవింగ్ చేయకూడదు. జన సమూహం ఎక్కువగా ఉన్న చోట, పాఠశాలల వద్ద నిదానంగా వెళ్ళాలి. ఒకే విడతలో ఎక్కువ గంటలు ట్రక్కులు నడుపరాదు. రాత్రిళ్ళు చీకటిలో సైకిళ్లపై ప్రయాణం చేయకూడదు. ద్వి చక్ర వాహనదారులు హెల్మెట్లు, కార్లలో ప్రయాణం చేయువారు సీటు బెల్టులు ధరించాలి. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వరాదు.రహదారుల వెంబడి మరిన్ని స్పీడ్ గన్స్ ఏర్పాటు చేయాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలి. స్పీడ్ బ్రేకర్స్ మీద రేడియం రంగువేయాలి. మలుపుల దగ్గర, ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డు పెట్టాలి. అవసరం లేని వారికి స్పోర్ట్స్ బైక్స్ నిషేధించాలి. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై జరిమానాతో పాటుగా 5 సంవత్సరముల వరకు కొత్తగా లైసెన్సులు జారీ చేయకూడదు. మైనర్లు పట్టుబడితే వారిపైనే కాకుండా ఆ బండి యాజమానుల పైనా జరిమానాతో పాటుగా వారి లైసెన్సులు కూడా రద్దు చేయాలి. కళాశాలలను సందర్శించి స్పోర్ట్ బైక్స్ కనిపిస్తే కళాశాల యాజమాన్యాల వారిపైనా కూడా చర్యలు తీసుకోవాలి. లైసెన్స్ విధానం కఠిన తరం చేయాలి. ఇవి కేవలం అధికారులు, ప్రభుత్వాలు చేయలేవు. ప్రజలు కూడా సహకరించాలి.

**జనక మోహన రావు దుంగ**
**8247045230**

# ఆదర్శమూర్తి , సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ షేక్ బుడే



పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు, ఆదర్శమూర్తి , కామ్రేడ్ షేక్ బుడే 36వ వర్ధంతి,,ప్రముఖ మార్క్సిస్టు- లెనినిస్ట్ నాయకుడు కామ్రేడ్ షేక్ బుడే 1988 నవంబర్ 4వ తేదీన 60 సంవత్సరాల వయస్సులో తీవ్రమైన గుండె పోటుతో మరణించారు. కామ్రేడ్ షేక్ బుడేని నక్సలైట్ బుడే అనిఏ టైగర్ బుడే అని పిలుచుకునేవారు. కామ్రేడ్ ..షేక్ బుడే 1948వ సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించాడు. కామ్రేడ్ షేక్ బుడే గారి తండ్రి మీరా సాహెబ్ చిన్నతనంలో చనిపోవడంతో నరసరావుపేట నుండి ఆయన తల్లి పుట్టిల్లు తెనాలికి బిడ్డలతో వచ్చింది. అక్కడ పెద్దమ్మ కొడుకు హసన్ అహ్మద్ వద్ద టింకరింగ్, ట్రంకు పెట్టెల తయారీ పని నేర్చుకున్నాడు.హసన్ అహ్మద్ దగ్గరకు కమ్యూనిస్టు పార్టీ నాయకులు రాకపోకలు సాగించేవారు. ఆ క్రమంలో ఆయన కమ్యూనిస్టు ప్రముఖులు రావి అమ్మయ్య, లావు బాలగంగాధర రావు, వంగర వెంకటసుబ్బయ్య తదితరులతో పరిచయం మూలమున కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించాడు. 1952 వ సంవత్సరంలో వారి సోదరి ద్వారా ఇమాంబితో గుంటూరులో వివాహం జరిగి, ఆయన సభ్యత్వం తెనాలి నుండి గుంటూరుకు మార్చుకున్నాడు. టింకరింగ్ వృత్తి చేసుకుంటూ ,కుటుంబ జీవితాన్ని గడుపుతూ నగరంలో కమ్యూనిస్టు పార్టీ ముఖ్య కార్యకర్తగా ఎదిగాడు. సిద్ధాంత పరిజ్ఞానాన్ని పెంచుకున్నాడు. 1964 లో కమ్యూనిస్టు పార్టీ చీలికల్లో గుంటూరు మార్క్సిస్టు పార్టీ నగర కమిటీ సభ్యుడయ్యారు. పశ్చిమ బెంగాల్లో 1967 మే 25న జరిగిన నక్సల్బరి గిరిజనుల పోరాటంపై నాటి రాష్ట్ర ప్రభుత్వం కాల్పులు జరిపింది .ఆ పోలీస్ కాల్పుల్లో ఇద్దరు పిల్లలతో సహా 11 మంది చనిపోయారు. బంగ్లా కాంగ్రెస్ నాయకత్వాన సిపిఐ (ఎం) నాయకుడు జ్యోతి బసు డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉండగా, ఎస్ యు సి ఐ పార్టీలు కూడా ప్రభుత్వంలో ఉన్నాయి. నక్సల్బరి గిరిజన పోరాటాన్ని బలపరుస్తూ మావో మహాశయుని నాయకత్వాన ఉన్న చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం, వారి పత్రిక పెకింగ్ రివ్యూ లోనూ,రేడియోలోనూ విస్తృతమైన ప్రచారాన్నిచ్చింది. చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రకటన సీపీఐ(ఎం) పార్టీలో అంతర్గత చర్చకు ఊపునిచ్చింది.గిరిజన రైతాంగం పై పోలీసుల కాల్పుల ఘటన దేశవ్యాప్తంగా ఒక కుదుపు గుదిపింది. నక్సలబరి రైతాంగ పోరాటానికి మద్దతుగా గుంటూరులో నక్జల్బరీ సంఘీ భావ కమిటీ ఏర్పడింది. ఆ కమిటీ నిర్మాణంలో కామ్రేడ్ షేక్ బుడే భాగస్వామ్యం అయ్యాడు. శ్రీకాకుళ పోరాటం తీవ్ర రూపం దాల్చినప్పుడు ఆ గిరిజన పోరాటానికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా అదే తరహాలో పోరాటాన్ని విస్తరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విప్లవ కమ్యూనిస్టులు భావించారు. అందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా పార్టీ కమిటీని ఏర్పాటు చేయాలని, వర్గ పోరాటం విస్తృత పరచాలని భావించారు. నక్సల్ బరి పోరాట అగ్ర నాయకుడైన చారుమజుందారును గుంటూరు జిల్లాకు తీసుకొచ్చి నాటి గుంటూరు(నేటీ పల్నాడు) జిల్లా గుత్తికొండలో 1968 ఫిబ్రవరి 28వ తేదీ నుండి మార్చి 2వ తేదీ వరకు సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో చౌదరి తేజేశ్వరరావు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. పంచాది కృష్ణమూర్తి , వై కోటేశ్వరరావు, ఆయన భార్య మణీ, తిప్పాని వెంకటరావు (టీవీ కార్టూనిస్ట్)ఆయన భార్య అరుణ , నాగభూషణం పట్నాయక్, కేఎస్ మహాదేవన్ , షేక్ బుడే, మంచా వెంకట నరసయ్య, ముల్పూరు వెంకటరత్నం, కొండపల్లి చంద్రశేఖర్ (కొండపల్లి సీతారామయ్య గారి కుమారుడు), కేజీ సత్యమూర్తి , విష్ణుమూర్తి, సి.కే.నారాయణరెడ్డి ,దామా చెంచయ్య , మరి కొంతమంది ప్రముఖ మార్క్సిస్టు- లెనినిస్టు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కామ్రేడ్ షేక్ బుడే , ముల్పూరు వెంకటరత్నం తో పాటు విశాఖపట్నం నిర్మాణ బాధ్యతలు చూడాలని నిర్ణయించబడింది. విశాఖపట్నం జిల్లా చింతపల్లి ఏరియాలో పనిచేస్తున్న సందర్భంగా ఆయన పోలీసులకు చిక్కారు. చింతపల్లి ,నర్సీపట్నం పోలీస్ స్టేషన్ లో తీవ్రమైన చిత్రహింసలకు గురైనప్పటికీ పార్టీ రహస్యాలను చెప్పకుండా ధృఢచిత్తుడై వ్యవహరించాడు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పార్వతీపురం కుట్ర కేసులో ఇరికించబడ్డాడు. విశాఖపట్నం జైలులో కామ్రేడ్స్ కొల్లా వెంకయ్య, కానూ సన్యాల్, నాగభూషణం పట్నాయక్, భువనమోహన్ పట్నాయక్, మొదలగు ప్రముఖులతో కలిసి ఐదు సంవత్సరాలు జైలు జీవితం అనుభవించారు. 1969 అక్టోబరు ఎనిమిదో తేదీన విశాఖపట్నం సెంట్రల్ జైలు గోడలను ఛేదించుకొని బయటకు వచ్చిన 11 మంది విప్లవ కమ్యూనిస్టుల్లో కామ్రేడ్ బుడే ప్రముఖుడు. విశాఖపట్నం సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆ కాలమంతా రహస్యంగా ఉంటూ గ్రామీణ పేదలు,రైతులు మధ్య పని చేస్తూ వచ్చారు. 1971 ప్రారంభంలో ద్రోహి ముసలయ్య పోలీసులకు ఇచ్చిన సమాచారంతో కామ్రేడ్ షేక్ బుడే పొన్నూరు తాలూకా చింతలపూడి - వల్లభాపురం మధ్య అరటి తోటలో పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు ముఖ్య కార్యకర్తలు అత్తలూరు మల్లికార్జునరావు, చింతల సింగయ్య తప్పించుకున్నారు. ఆ తరువాత కామ్రేడ్ బుడేను వినుకొండ, నరసరావుపేట గుంటూరు పోలీస్ క్లబ్, స్టేషన్లలోఉంచి,పార్టీ రహస్యాలు చెప్పమని 40 రోజులపాటు తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసారు. రాష్ట్రంలోనూ,గుంటూరు నగరంలోనూ ప్రజలు,ప్రజాతంత్ర వాదులు ఆందోళన చేసారు.ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో కామ్రేడ్ బుడేని పోలీసులు అరెస్ట్ చేశారని , కామ్రేడ్ షేక్ బుడే జీవించి ఉన్నాడా ?లేక ఎన్కౌంటర్ చేయబడ్డాడా? అని నాటిహోం మంత్రి జలగం వెంగళరావును సిపిఐ సభ్యుడు కామ్రేడ్ కనపర్తి నాగయ్య ప్రశ్నించాడు. కామ్రేడ్ బుడే అరెస్టు చేయబడ్డాడని ప్రభుత్వం ప్రకటించక తప్పలేదు. 1972లో చైనాకు వెళ్ళిన సిపిఐ(ఎం.ఎల్) ప్రతినిధి వర్గంతో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం సిపిఐ(ఎం.ఎల్) పార్టీ చేస్తున్న దళ చర్యలు వ్యక్తిగత హింసా వాదం అని, అది ప్రజా ఉద్యమం కాదని సిద్ధాంతరీకరించారు. విశాఖపట్నం జైలులో ఉన్న సిపిఐ (ఎం.ఎల్) అగ్రనాయకులు కానూ సన్యాల్ ,కొల్లా వెంకయ్య, చౌదరి తేజేశ్వరరావు, సౌరెన్ బోస్, నాగభూషణం పట్నాయక్, భువనమోహన్ పట్నాయక్ లు రాసిన ఆరుగురు లేఖ తర్వాత అప్పటిదాకా సాయుధ పోరాటం అనే భ్రమలో అనుసరించినటువంటి వ్యక్తిగత హింసవాదాన్ని వదిలివేశారు. పార్వతీపురం కుట్ర కేసులో కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారి చే రూపొందించబడిన" మా మౌలిక సిద్ధాంతం" కోర్టు ప్రకటనపై సంతకం చేశారు. నాటినుండి కామ్రేడ్ కొల్లా వెంకయ్య గారి నాయకత్వాన మార్క్సిస్టు-లెనినిస్టు కమిటీ నాయకత్వాన కమ్యూనిస్టు ఉద్యమ సమైక్యతను కాంక్షిస్తూ, అందుకొరకు కృషి చేస్తూ వచ్చారు. అత్యవసర పరిస్థితి కాలంలో రాజకీయ ఖైదీగా నిర్బంధించబడ్డారు. జైలు నుండి విడుదలైన తర్వాత కొల్లా వెంకయ్య గారి నాయకత్వాన గుంటూరు ప్రకాశం జిల్లాలో గ్రామీణ పేదల సంఘం ఏర్పాటులోనూ , సంతరావూరు ,కొప్పుకొండ నిజాంపట్నం మొదలగు గ్రామాలలో పోరాట ఆందోళన రూపుదిద్దటంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. 1973 భూ సంస్కరణల చట్టం అమలు కొరకు జరిగిన పాదయాత్రలలోనూ, నల్లమడ ముంపు నివారణ కొరకు జరిగిన ఉద్యమంలోనూ విశేష కృషి చేశారు. గుంటూరు నగరంలో దీర్ఘకాలం నడిచిన సిటీ బస్సు కార్మికుల ఆందోళన, జూట్ మిల్ కార్మికుల ఆందోళన, బిఏటి కార్మికుల సమ్మె మొదలగు ముఖ్య ఘట్టాలన్నిటా ఆయన పాల్గొన్నారు.




భారత దేశంలో కమ్యూనిస్టు పార్టీ పుట్టి 100 సంవత్సరాలకు పైగా అయింది. నక్సల్ బరి శ్రీకాకుళం ఉద్యమాలు జరిగి 50 సంవత్సరాలు గడిచాయి. భారత కమ్యూనిస్టు ఉద్యమం అనేక ఆటుపోట్లకు గురి అయింది. అతివాద,మితవాద, అవకాశవాద ,వ్యక్తిగత హింసవాదాలకు గురి అయ్యింది. కమ్యూనిస్టు ఉద్యమం అనేక అనుభవాలు సంపాదించుకున్నది. పోస్టుమార్టం ఉద్యమాలు ఫెమినిస్ట్ ఉద్యమాలు , నయా అంబేద్కర్ ఉద్యమాలు, బహుజన దళిత ఉద్యమాలు , వచ్చాయి. ఈనాడు మనం కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ) చర్చిస్తున్నాము. ఈనాడు కేంద్ర పాలకవర్గాలు ఆర్ఎస్ఎస్ -బిజెపిలు ఫాసిజాన్ని అనుసరిస్తున్నాయి.భారత కమ్యూనిస్టు ఉద్యమం సిపిఐ, సీపీఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) రెడ్ స్టార్ ,లిబరేషన్, జనశక్తి ,న్యూ డెమోక్రసీ, ప్రతిఘటన, ప్రజా ప్రతిఘటన, సిపిఐ (మావోయిస్టు), ఎం సిపిఐ, గ్రూపులుగా చీలిపోయి ఉన్నాయి. భారత సమాజంలో ఉన్న వర్గ ,వర్ణ, కుల సంక్లిష్టత విప్లవోద్యమానికి ఆటంకంగా తయారయ్యింది. భారతదేశ విప్లవోద్యమానికి , విప్లవపంథా రూపొందించడానికి అనేక అడ్డంకులు తయారయ్యాయి. భారతదేశం కమ్యూనిస్టులు చైనా , రష్యాతరహా పంథాలను అనుసరించకుండా స్వతంత్రమైనటువంటి పార్టీ కార్యక్రమం పంథాలను రూపొందించుకోవాలని కామ్రేడ్ బుడే ఆశించేవారు.తెలంగాణ సాయుధ పోరాట కాలంలో 4000 మంది అమరులయ్యారు. శ్రీకాకుళ పోరాట కాలంలో 400 మంది అమరులయ్యారు. నక్సల్బరి, శ్రీకాకుళ పోరాటంనుండి నేటి వరకు 5000 మందికి పైగా అమరులయ్యారు.

*కొల్లిపర వెంకటేశ్వరరావు,*
*కన్వీనర్*
*కామ్రేడ్‌షేక్ బుడే సంస్మరణ కమిటీ, గుంటూరు.*
*మొబైల్ నెంబరు:93923 25652*



# ధార్మిక బలం



బలం అనేక రూపాల్లో ఉంటుంది. భుజ బలం, బుద్ధి బలం, నైతిక బలం, సామాజిక బలం... ఇలా బహుముఖీనంగా ఉంటుంది. భుజ బలం కన్నా బుద్ధి బలం గొప్పది. ఆ బలం వల్లనే మానవ సమాజం మిగిలిన జంతు సమాజాలన్నిటికన్నా మేటి కాగలిగింది. సమాజం వికాసం పొందే కొద్దీ బుద్ధి బలం కన్నా నైతిక బలం విశేష గౌరవం పొందగలిగింది. భుజ బలం ఉన్న రాజులు, చక్రవర్తుల కన్నా బుద్ధి బలం ఉన్న గురువులు ఆచార్యులే గౌరవనీయులయ్యారు. గురువుల కన్నా నైతిక, ధార్మిక ప్రబోధాలు చేసే ప్రబోధకులు అందరికన్నా మేటిగా సమాజ గౌరవాలు పొందారు. రెండు సంఘటనలను గమనిస్తే ధార్మిక గురువులను ఎందుకు గౌరవించాలో అర్థమవుతుంది.

ఒక రోజు అలెగ్జాండర్, ఆయన గురువు ఆరిస్టాటిల్ ఒక అడవిలో నడిచిపోతున్నారు. మార్గమధ్యంలో తటాకం ఎదురయింది. దాని నిండా తూటి కాడ అల్లుకుపోయి ఉంది. ఆ నీరు ఎంత లోతు ఉంటుందో, ఆ తటాకం అడుగున లోతు ఎక్కడ ఉంటుందో, ఎక్కడ ఊబి ఉంటుందో వారిద్దరికీ తెలియలేదు. శిష్యుడితో ఆరిస్టాటిల్ "నాయనా! నేను వృద్ధుణ్ణి. ఈ తటాకంలో ఏ ప్రమాదం ఉందో మనకు తెలియదు. నేను ముందు దిగుతాను. నేను సురక్షితంగా ఆవలి ఒడ్డుకు చేరిన తరువాత నీవు రా" అన్నాడు

అప్పుడు అలెగ్జాండర్ "గురుదేవా! మీరు మహా మేధావులు. జ్ఞాన సంపన్నులు. నాకన్నా ఈ ప్రపంచానికి మీ అవసరం ఎక్కువ. నేను మరణిస్తే నాలాంటివారిని ఎందరినో మీరు తీర్చిదిద్దగలరు. కానీ, నాలాంటి వారు వందలు, వేలమందయినా మీలాంటి బుద్ధిబలం ఉన్నవారిని ఒక్కరిని తయారు చేయలేం. కాబట్టి నేనే ముందు వెళ్తాను. ప్రమాదం ఏదైనా ఉంటే నేనే ఎదుర్కొంటాను" అని, గురువు పాదాలకు నమస్కరించి, తటాకంలోకి దిగాడు.ఇప్పుడు నైతిక బలం ఎంత గొప్పదో తెలియజేసే మరో కథను చూద్దాం. చక్రవర్తుల్లో అశోకుడు మేటి అని ప్రపంచం మొత్తం అంగీకరించింది. కళింగ యుద్ధం తరువాత అశోకుడి మనసు మారింది. కరుణతో నిండిపోయింది. పరమ ధార్మికుడై బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాడు. ఒక రోజు అశోకుడు తన పరివారంతో రాజ వీధిలో నడిచి పోతున్నాడు. వారికి ఎదురుగా ఒక బౌద్ధ భిక్షువు వస్తున్నాడు. అతను దగ్గరకు రాగానే అశోకుడు మోకాళ్ళ మీద కూర్చొని, శిరస్సు వంచి, పాదాభివందనం చేశాడు. మిగిలిన వారందరూ అలాగే చేశారు.

ఆ తరువాత అశోకునితో ఒక మంత్రి "మీరు మహా చక్రవర్తులు. మీది అభిషిక్తమైన శిరస్సు. మీ శిరస్సు, కిరీటం వంగకూడదు. తలదించి ఎవరికీ నమస్కరించకూడదు. మహారాజా! ఇది ఆజ్ఞ కాదు. నా అభిప్రాయం" అన్నాడు చాలా మర్యాదగా.అశోకుడు చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

రెండు రోజులు గడిచాయి. అశోకుడు ఒక మేక తల, ఒక జింక తల తెప్పించి, ఒక పళ్ళెంలో పెట్టించాడు. ఒక సేవకుణ్ణి పిలిచి, ఆ రెండు పళ్ళాలూ ఇచ్చి "వీటిని అమ్ముకురా" అని పంపాడు. అతను వీధిలోకి వెళ్ళి, వెంటనే అమ్ముకొని వచ్చేశాడు. ఆ రోజు సాయంత్రమే మరణించిన ఒక మనిషి తలను అశోకుడు తెప్పించి, దాన్ని బంగారు పళ్ళెంలో ఉంచాడు. మళ్ళీ సేవకుణ్ణి పిలిచి "దీన్ని అమ్ముకురా" అని చెప్పాడు. అతను సాయంత్రానికి తిరిగి వచ్చి "మహారాజా! ఎవరూ కొనలేదు" అన్నాడు."వెళ్ళు, ఉచితంగా ఇచ్చిరా" అన్నాడు అశోకుడు. అతను వెళ్ళి, తిరిగి వచ్చి "మహారాజా! ఎవరూ తీసుకోలేదు" అన్నాడు.అప్పుడు అశోకుడు తన మంత్రిని పిలిచి "మహాశయా! ఇది ఒక దొంగ తల. అందుకే ఎవరూ కొనలేదనుకుందాం. దీని స్థానంలో నా తలను ఉంచితే అమ్ముడుపోతుందా?" అని అడిగాడు. అశోకుడు తనకు ఏం చెప్పదలచుకున్నాడో ఆ మంత్రికి అర్థమైంది. "నా తలకు వెల లేదు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
5 | హైదరాబాద్ | గురువారం | 31 । అక్టోబర్ । 2024

## తేనెతో వీటిని కలపొద్దు...



తేనె ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే తీపి పదార్థం. కొన్ని ప్రత్యేక వంటకాల్లో, బేకింగ్ ఉత్పత్తుల్లో చక్కెరకు బదులు తేనెను ఉపయోగిస్తుంటారు. అంతేకాదు ఎన్నో ఔషధగుణాలు ఉన్న తేనెతో ఆయుర్వేద మందులు కూడా తయారు చేస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతోపాటు చర్మ సంబంధిత అలెర్జీల నివారణకు, కాలిన గాయాలను మాన్పడానికి, దగ్గు తదితర గొంతు సమస్యల నుంచి బయటపడేందుకు తేనె అద్భుతంగా పనిచేస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న తేనెను ఎలా ఉపయోగించాలో తెలుసుకోవాలి. ముఖ్యంగా కొన్ని పదార్థాలతో తేనెను అసలు కలపకూడదు అంటున్నారు నిపుణులు. అవేంటో చూద్దాం!వేడి నీళ్లు: బాగా వేడిగా ఉండే నీళ్లతో కలిపినపుడు తేనెలోని ఎంజైమ్స్, పోషకాలు నశిస్తాయి. అందులోని సహజ చక్కెరలు కూడా వేడెక్కి కార్సినోజెనిక్ పదార్థాలను విడుదల చేస్తాయి. వీటివల్ల కేన్సర్ వచ్చే ప్రమాదముంటుంది. అందుకే గోరువెచ్చని నీటితో కలిపి సేవించడం మంచిది.వెల్లుల్లి: కొన్ని చైనీస్ వంటకాల్లో తేనెను, వెల్లుల్లిని కలిపి అత్యధిక ఉష్ణోగ్రత వద్ద ఫ్రై చేస్తుంటారు. దీనివల్ల వెల్లుల్లిలోని ఘాటైన పొరలు తేనెకున్న సహజ స్వభావాన్ని నాశనం చేస్తాయి. ఈ రెంటినీ కలిపి తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం.కీర: తేనె, కీర రెండూ ఆరోగ్యానికి చాలా మంచివి. కానీ వీటికున్న వ్యతిరేక లక్షణాల వల్ల రెంటినీ కలిపి తీసుకోవడం మంచిది కాదని ఆయుర్వేదం చెబుతోంది. కీరా శరీరాన్ని చల్లబరిస్తే తేనె వేడిని పుట్టిస్తుంది. ఈ రెంటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు వస్తాయి.

# ఆనందాల దీపావళి





భారతీయ సంస్కృతికి ప్రతిబింబంగా వెలుగొందేవి భారతీయ పండుగలు. వాటిలో ఆనంద ఉత్సాహాలతో జాతి, కుల, మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండుగే దివ్య దీప్తుల దీపావళి. జగతిని జాగృతం చేసే చైతన్య దీప్తుల శోభావళి. నరకాసురుడనే రాక్షసుడిని సంహరించన మరుసటి రోజు అతడి పీడ వదిలిన ఆనందంలో ప్రజలు దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే లంకలోని రావణుడిని సంహరించి శ్రీరాముడు సతీసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినపుడు కూడా ప్రజలు ఆనందోత్సవాల మధ్య దీపావళిని జరుపుకున్నారని రామాయణం చెపుతోంది. చీకటిని తోలుతూవెలుగులు తెచ్చే పండుగగా, విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటారు. దీప మాళికల శోభతో వెలుగొందే గృహాంగణాలు, ఆనంద కోలాహలంతో వెల్లివిరిసే ఆబాల గోపాలం, నూతన వస్త్రాల రెపరెపలు, పిండివంటల ఘుమఘుమలు, బాణసంచా చప్పుళ్ళు, ఈ దివ్య దీపావళి సోయగాలు. ఈ పండుగ ప్రతియేటా ఆశ్వయుజ అమావాస్య రోజున వస్తుంది. దీపాల పండుగకు ముందు రోజు ఆశ్వయుజ బహుళ చతుర్థశి. దీన్ని నరక చతుర్ధశిగా జరుపుకుంటారు.

**దీపాలంకరణ మరి యు లక్ష్మీ పూజ**

**దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహమ్ ।**
**దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమ్మోస్తుతే ॥**

దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు.

మహిళామణులంతా ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుండి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. పైగా ఈ దీపావళి శరదృతువులో అరుదెంచటం విశేషం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది. దీపాలపండుగ అయిన దీపావళిళి2రి రోజున మహాలక్ష్మి పూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. పూర్వం దుర్వాస మహర్షి ఒకమారు దేవేంద్రుని ఆతిథ్యానికి సంతసించి, ఒక మహిమాన్వితమైన హారాన్ని ప్రసాదించాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావముతో తన వద్దనున్న ఐరావతం అను ఏనుగు మెడలో వేస్తాడు అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది. అది చూచిన దుర్వాసనుడు ఆగ్రహము చెంది దేవేంద్రుని శపిస్తాడు. తత్ఫలితంగా దేవేంద్రుడు రాజ్యమును కోల్పోయి, సర్వసంపదలు పోగొట్టుకుని దిక్కుతోచక శ్రీహరిని ప్రార్థిస్తాడు. ఈ పరిస్థితిని గమనించిన శ్రీ మహావిష్ణువు దేవేంద్రుని ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీ మహాలక్ష్మి స్వరూపంగా తలచి పూజించమని సూచిస్తాడు. దానికి తృప్తిచెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సర్వసంపదలను పొందాడని పురాణాలు చెబుతున్నాయి.

ఆ సమయంలో శ్రీ మహావిష్ణువు చెంతనే ఉండే మహాలక్ష్మీదేవిని ఇంద్రుడు ఇలా ప్రశ్నించాడు. తల్లి నీవు కేవలం శ్రీహరి వద్దనే ఉండటం న్యాయమా? నీ భక్తులను కరుణించవా? అంటాడు. దీనికి ఆ మాత సమాధాన మిస్తూ.. త్రిలోకాధిపతీ.. "నన్ను త్రికరణ శుద్ధిగా ఆరాధించే భక్తులకు వారి వారి అభీష్టాలకు అను గుణంగా మహర్షులకు మోక్ష లక్ష్మీ రూపంగా, విజయాన్ని కోరేవారికి విజయలక్ష్మీగా, విద్యార్థులు నన్ను ఆరాధిస్తే విద్యాలక్ష్మీగా, ఐశ్వర్యాన్ని కోరి ఆరాధించేవారికి ధనలక్ష్మీగా, వారి సమస్త కోరికలు నెరవేర్చే వరలక్ష్మీదేవిగా ప్రసన్నురాలౌతానని" సమాధానమిచ్చింది. అందుచేత దీపావళి రోజున మహాలక్ష్మిని పూజించేవారికి సర్వసంపదలు చేకూరుతాయని విశ్వాసం.

**నరక చతుర్దశి:**

ఆశ్వయుజ బహుళ చతుర్దశి నరక చతుర్దశిగా ప్రసిద్ధి పొందింది. నరకాసురుడు నే రాక్షసుడు చెలరేగి సాధు జనాలను పీడిస్తూ దేవ, మర్త్య లోకాలలో సంక్షోభాన్ని కలిగిస్తుంటాడు. కృతయుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామి కి, భూదేవికి అసుర సంధ్యా సమయంలో జన్మిస్తాడు నరకుడు. అతడు లోక కంటకుడైనా మహావిష్ణువు వధించరాదని, తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానునిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది.

అప్పటికి నరకాసురుడు లోక కంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలి వెళ్తాడు శ్రీకృష్ణుడు. వారి మధ్యజరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్ధశిగా పిలువబడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు,' బొద్దు పాత్యంపదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డారు, ధర్మం సుప్రతిష్ఠమైంది.

నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమవాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది.

**సత్యం-శివం-సుందరం**

పంచభూతాలలో ప్రధాన మైనది అగ్ని:

ఈ అగ్ని ప్రాణికోటి మనుగడకు ఉపకరించే తేజస్సును, ఆహారాన్ని ఐహికంగాను, విజ్ఞాన ధర్మగరిమను ఆధ్యాత్మికంగాను ప్రసాదిస్తుంది. ఈ దీపాల వెలిగింపు ద్వారా మూడు రంగులు ప్రధానంగా మనకు గోచరమవుతాయి. నీలము, పసుపు, తెలుపు- ఈ మూడు రంగులు మానవ మనుగడకు అవశ్యకమైన సత్త్వరజస్తమోగుణాల సమ్మేళనంగా ఆర్యులు చెబుతుంటారు. ఈ మూడు రంగులను జగతిని పాలించే లక్ష్మి, సరస్వతి, దుర్గలుగా భావిస్తారుట పౌరాణికులు. అంతేకాక సత్యం-శివం-సుందరం - అవి దీప ప్రజ్వలన ద్వారా త్రిజగన్మాతలను ఆరాధించినట్లును, మానవులకు విజ్ఞానం, వివేకం, వినయాలకు సంకేతమని సందేశాత్మకంగా గైకొంటారు భారతీయులు.

అంధతమిస్రంచ దక్షిణాయనమేవచ
ఉత్తరాయణే తస్మా జ్యోతిర్దానం ప్రశస్వతే

అంధ తమ్రసమనేది ఒక నరకం, దక్షిణాయన పాపకాలం నుండి తప్పించుకొని తరించడానికి ఉత్తరాయణ పుణ్యకాలంలో జ్యోతిని దానం చేయుట ఉత్తమోత్తమమైన కార్యంగా భావిస్తారు హైందవులు. ఆశ్వయుజ మాసంలో వచ్చే బహుళ చతుర్థశి, అమావాస్యలు పరమ పవిత్ర పర్వదినాలు. భక్తి విశ్వాసాలతో, ఆనందోత్సాహాలతో దేశమంతటా పిల్లలూ, పెద్దలూ అందరూ కలసి జరుపుకునే పండుగ రోజులివి.

**దిబ్బు దిబ్బు దీపావళి**

దిబ్బు దిబ్బు దీపావళి మళ్ళీ వచ్చే నాగులచవితి అంటూ చిన్న పిల్లలంతా గోగునార కట్టలకి చిన్న చిన్న గుడ్డ ముక్కల్ని కట్టి వెలిగించి దిష్టి తీయడాన్ని మనం సంప్రదాయంగా కొన్ని ప్రాంతాలల్లో చూస్తూంటాం. సాయంత్రం ప్రదోష సమయంలో దీపాలు వెలిగించి, ముందుగా పిల్లలు దక్షిణ దిశగా నిలబడి దీపం వెలిగించడాన్ని ఉల్కాదానం అంటారు. ఈ దీపం పితృదేవతలకు దారి చూపుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఆ దీపం వెలిగించిన తరువాత కాళ్ళు కడుక్కుని ఇంటిలోపలకు వచ్చి తీపి పదార్థం తింటారు. అటు తరువాత పూజాగృహంలో నువ్వులనూనెతో ప్రమిదలు వెలిగించి దీపలక్ష్మికి నమస్కరించి కలశంపై లక్ష్మీదేవిని అవాహన చేసి విధివిధానంగా పూజిస్తారు. పూజానంతరం అందరూ ఉత్సాహంగా బాణాసంచా కాల్చడానికి సంసిద్ధులౌతారు. చిచ్చుబుడ్లు, విష్ణుచక్రాలు, భూచక్రాలు, మతాబులు, కాకరపువ్వొత్తులు, కళ్ళు మిరుమిట్లుగొలుపుతుంటే మరో ప్రక్క సీమటపాకాయల ధమధమ ధ్వనులతో మ్రోగుతుంటాయి పరిసరాలన్నీ. ఈ విధంగా బాణాసంచా కాల్చడానికి ఒక ప్రయోజనం చెప్పబడింది పురాణాలలో, ఆ వెలుగులో, శబ్దతరంగాలలో దారిద్ర్య దు:ఖాలు దూరంగా తరిమి వేయుబడి లక్ష్మీకటాక్షం సిద్ధిస్తుందని, అంతేకాక వర్షఋతువులో ఏర్పడిన తేమవల్ల పుట్టుకువచ్చే క్రిమి కీటకాలు బాణాసంచా పొగలకి నశిస్తాయి.

అసుర నాశనానికి, ధర్మ ప్రతిష్ఠాపనకు గుర్తుగా అమావాస్యనాడు జరుపుకునే దీపావళి పండుగనాడు లక్ష్మీదేవికి ప్రతీకగా వెలుగులు విరజిమ్మే దీపలక్ష్మిని పూజించడం సర్వశుభాలు ప్రసాదిస్తుంది.

దీపావళి చుట్టూ అనేకానేక కథలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుణ్ణీ వధించాడు గనుక ప్రజలు ఆనందంతో మరునాడు దీపావళి సంబరం చేసుకుంటారని ఒక కథ. ఇంకో కథకూడా ఉంది. లంకలో రావణుని సంహరించి, రాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో ఈ పండుగ జరుపుకున్నారని చెబుతారు. ఉత్తరాదివారు ముఖ్యంగా వ్యాపారులు దీపావళి రోజును కొత్త సంవత్సరంగా పాటిస్తారు.











## బ్యాంకింగ్, ఐటీ షేర్ల అమ్మకాలు.. నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



**న్యూఢిల్లీ–నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంకింగ్ షేర్ల అమ్మకాలతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల పవనాలతో ఈక్విటీ మార్కెట్లు బుధవారం నష్టాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత ఏ దశలోనూ మార్కెట్లు కోలుకోలేదు. చివరి సెషన్‌లో మార్కెట్లు మరింత నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం సెన్సెక్స్ 80,237.85 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,435.61 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 79,821.99 పాయింట్లకు పతనమైంది. చివరకు 426.85 పాయింట్లు పతనమై.. 79,942.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 126 పాయింట్లు పతనమై.. 24,340.80 వద్ద ముగిసింది. దాదాపు 2,787 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 978 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో సిప్లా, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ టాప్ లూజర్‌గా నిలిచాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా కన్స్యూమర్, హీరో మోటోకార్ప్, బ్రిటానియా ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ లాభపడ్డాయి. సెక్టోరల్‌లో ఎఫ్ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, మీడియా 0.5 నుంచి 2శాతం పెరిగాయి. బ్యాంక్, ఫార్మా, ఐటీ ఒకశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదిలా ఉండగా.. దీపావళి రోజున ఎన్ఎస్ఈ, బీఎస్ఈలతో పాటు కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో నవంబర్ ఒకటో తేదీన ముహురత్ ట్రేడింగ్ జరుగనున్నది.

## జనవరికల్లా కఠిన నిబంధనలు.. స్పామ్ కాల్స్, మెసేజ్‌లకు అడ్డుకట్ట: ట్రాయ్




**న్యూఢిల్లీ–నవభూమి:** వచ్చే ఏడాది జనవరికల్లా స్పామ్ కాల్స్, మెసేజ్‌ల అడ్డుకట్టకు సవరించిన కఠిన నిబంధనల్ని అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని టెలికం రెగ్యులేటర్ ట్రాయ్ చైర్మన్ అనిల్ కుమార్ లహోటి తెలిపారు. ఇటీవలి తమ కన్సల్టేషన్ పేపర్‌పై జరిపిన విస్తృత చర్చల తర్వాత మొబైల్ వినియోగదారులను విసిగిస్తున్న స్పామ్ కాల్స్, మెసేజ్‌లకు మరింత కఠిన నిబంధనల అమలు అవసరమని గుర్తించామన్నారు.
అలాగే ఇటీవల టెలికం శాఖ నుంచి వచ్చిన సిఫార్సు ఆధారంగా టెలీమార్కెటీర్ల కోసం రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్‌పై మరో కన్సల్టేషన్ పేపర్‌ను సైతం సిద్ధం చేయబోతున్నామని ట్రాయ్ చీఫ్ తెలియజేశారు. స్పామ్ కాల్స్, మోసపూరిత మెసేజ్‌లకు చెక్ పెట్టేందుకు గత కొన్ని నెలలుగా ట్రాయ్ తీసుకుంటున్న చర్యలను తాజాగా పీటీఐకి లహోటి వివరించారు.

## ఇంగ్లండ్ నుంచి భారీగా బంగారం తరలింపు.. ఎందుకంటే




**న్యూఢిల్లీ–నవభూమి:** మన దేశానికి పెద్ద ఎత్తున బంగారం నిల్వలు ఉన్నాయి. ఈ పసిడిని కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ ఆధీనంలో ఉంటుంది. 1990లలో కొన్ని పరిస్థితుల కారణంగా తాకట్టు పెట్టిన ఈ బంగారాన్నిక్రమంగా దేశంలోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం కీలక పరిణామం జరిగింది. కేంద్ర బ్యాంక్ ఆర్బీఐ ధన త్రయోదశి రోజున (మంగళవారం) 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్' నుంచి ఏకంగా 102 టన్నుల బంగారాన్ని మన దేశానికి తరలించింది. ఈ బంగారు ఖజానా మొత్తం మనదే. 1990లలో ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు తాకట్టు పెట్టి రుణాలు సేకరించింది. అయితే భద్రతతో పాటు వేర్వేరు కారణాలతో బంగారాన్ని అక్కడే చాలా కాలం నిల్వ చేసింది. అయితే తాజాగా అత్యంత వ్యూహాత్మకంగా ఈ బంగారాన్ని క్రమక్రమంగా భారత్‌కు తరలిస్తోంది. తాజాగా మంగళవారం నాడు అనగా ధన త్రయోదశి రోజున 102 టన్నుల బంగారాన్ని అత్యంత కట్టుదిట్టమైన భద్రతతో భారత్‌కు తీసుకొచ్చింది. ఇందుకోసం ప్రత్యేక విమానాలను కూడా ఉపయోగించింది. తాజా తరలింపుతో కలుపుకొని మన దేశంలో బంగారం నిల్వలు 510.5 టన్నులకు చేరాయి. ఇంగ్లండ్‌లో దాచింది మొత్తం 855 టన్నులు కాగా మిగతా పసిడి ఆ బ్యాంక్‌లోనే ఉంది. అంతర్జాతీయంగా రాజకీయ పరిస్థితులు మారిపోతుండడం, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో బంగారాన్ని మన దేశంలోనే సురక్షితంగా దాచుకోవడం మంచిదని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లు కూడా ఇందుకు కారణంగా ఉంది. అందుకే క్రమంగా బంగారాన్ని తరలిస్తోంది. తరలింపు ప్రక్రియలో భాగంగా సెప్టెంబరు 2022 నుండి ఇప్పటివరకు మొత్తం 214 టన్నుల బంగారాన్ని స్వదేశానికి తీసుకొచ్చింది. దీంతో స్వదేశంలో నిల్వ ఉన్న బంగారం నిల్వలు 510.5 టన్నులకు పెరిగాయి. ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌లో ఇంకా 324 టన్నుల బంగారు నిల్వలు ఉన్నాయి. మరి ఈ బంగారాన్ని కూడా ఆర్బీఐ ఎప్పుడు తరలిస్తుందో వేచిచూడాలి.

## సింఫనీ జోరు

Symphony

**హైదరాబాద్– నవభూమి:** ఎయిర్ కూలర్ల సంస్థ సింఫనీ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికపు కన్సాలిడేటెడ్ నికర లాభంలో 61 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. జూలై–సెప్టెంబర్‌లో రూ.56 కోట్ల లాభాన్ని ఆర్జించింది. కన్సాలిడేటెడ్ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 15 శాతం ఎగబాకి రూ.315 కోట్లకు చేరుకున్నట్లు కంపెనీ ఎండీ(కార్పొరేట్ వ్యవహారాలు) నృపేశ్ షా తెలిపారు. మరోవైపు, రూ.2 ముఖ విలువ కలిగిన ప్రతిషేరు రూ.2 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.


## ఆరోగ్యకరమైన మిరప పువ్వులు, సంతోషకరమైన రైతులకు భరోసా అందిస్తున్న గోద్రెజ్ రాషిన్‌బాన్




**న్యూఢిల్లీ–నవభూమి:** మిరప మొక్కలో కీలకమైన ఆర్థిక భాగమైనందున, మిరప సాగులో పువ్వులు విజయానికి అత్యంత కీలకం. ఈ కీలకమైన వాస్తవాన్ని గుర్తించి, ఈ కీలకమైన మొక్కల నిర్మాణాలను రక్షించే శాస్త్రీయ పరిష్కారాలను రైతులు స్వీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది." పూత సమయం అంటే రాషిన్‌బాన్ సమయం" అని జీఏవీఎల్ , క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ –సీఈఓ ఎన్ కె రాజవేలు పేర్కొన్నారు. "ఈ రోజు మిరప రైతులు తమ పంట ఎదుగుదల పరంగా సరైన సమయంలో సరైన పోషకాలను అందేలా చూసుకోవాల్సి ఉంది. అదే సమయంలో భూసారం కోల్పోకుండా (అబియోటిక్) చూసుకోవాలి. పురుగుమందుల అశాస్త్రీయ కలయికలు పంటలను పర్యావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఇది పంట దిగుబడిని ప్రభావితం చేయడమే కాకుండా వారి పొలాల సున్నితమైన పర్యావరణ సమతుల్యతను కూడా దెబ్బతీస్తుంది. ఈ సమస్యలను రాషిన్‌బాన్ పరిష్కరిస్తుంది. పంట నాటిన 45–75 రోజుల వద్ద రాషిన్‌బాన్ ఉపయోగించినప్పుడు, సమర్థవంతమైన పరిష్కారాన్ని అందిస్తుంది. ఇది ఒక సారి వినియోగిస్తేనే తామర పురుగు (త్రిప్స్) , లెపిడోప్టెరాన్స్, పచ్చ దోమ ( హాప్పర్స్)
నల్లి (మైట్స్)తో సహా అనేక రకాల కీటకాలను నాశనం చేస్తుంది. ఇది రైతులకు సమయం కృషిని ఆదా చేస్తుంది, వారి పంట ఆర్థిక విలువను కాపాడుతుంది.
రసం పీల్చు ఆకు నమిలే వంటి విస్తృత స్థాయి కీటకాల పై రాషిన్‌బాన్ ప్రభావవంతంగా పనిచేయటం వల్ల పలు రకాల పురుగుమందుల వినియోగపు అవసరాన్ని తొలగిస్తుంది , ఎక్కువ మార్లు స్ప్రే చేయాల్సిన అవసరాన్ని కూడా తగ్గిస్తుంది. నాటిన 45–75 రోజుల వద్ద పూత ఏర్పడే సమయం లో ఉపయోగించినప్పుడు, ఇది తరువాతి దశలలో మంచి దిగుబడికి హామీ ఇస్తుంది.
రాజవేలు మాట్లాడుతూ, "మిరప రైతు విజయాన్ని నిర్వచించేది పువ్వులు మీ మిరప పువ్వులను రాషిన్‌బాన్ తో రక్షించుకోవడం చాలా ముఖ్యం. సమగ్రమైన రక్షణ అందిస్తుండటం వల్ల మిరప మొక్కలు పూత దశకు చేరుకున్నప్పుడు వినియోగానికి ఇది ప్రత్యేకంగా సిఫార్సు చేయబడింది. ఇప్పటికే ఉన్న గ్రాసియా హనాబీ ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోతో పాటు, రాషిన్‌బాన్ ను కూడా జోడించడం ద్వారా మిరప పంట మొత్తం వాల్యూ చైన్‌లో రక్షణ అందించగలుగుతున్నాము" అని అన్నారు.
శాస్త్రీయ విధానాన్ని అవలంబించడం ద్వారా – గ్రాసియాతో ప్రారంభించి, రాషీన్‌బాన్‌తో నాటిన 45–75 రోజుల క్లిష్టమైన దశలో మీ మిరప పంట పువ్వులను రక్షించడం ద్వారా – మిరప రైతులు ఆరోగ్యకరమైన చీడపీడలు లేని పంటలు, మెరుగైన దిగుబడులు ఉజ్వల భవిష్యత్తును పొందవచ్చు, తద్వారా ప్రముఖ మిరప ఎగుమతిదారుగా భారతదేశ స్థానాన్ని నిలబెట్టుకోవచ్చు.

## భారీగా పెరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# బంగారం నిల్వలు




**న్యూఢిల్లీ–నవభూమి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం నిల్వలు భారీగా పెరిగాయి. మార్చి నుంచి సెప్టెంబర్ మధ్య బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషల్ సెటిల్‌మెంట్స్ నుంచి 102 టన్నుల బంగారాన్ని బదిలీ చేసుకుంది. దీంతో ఆర్‌బీఐ బంగారం నిల్వలు 855 మెట్రిక్ టన్నులకు చేరాయి. ఈ విషయాన్ని ఆర్‌బీఐ హాఫ్ ఇయర్ నివేదిక వెల్లడించింది. ఇందులో స్వదేశంలో 510.5 టన్నులు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద 324 మెట్రిక్ టన్నుల నిల్వ ఉన్నది. ఇక మరో 20.26 టన్నుల బంగారం డిపాజిట్ల రూపంలో ఆర్‌బీఐ వద్ద ఉందని నివేదిక పేర్కొంది. మొత్తం విదేశీ మారక నిల్వలలో బంగారం వాటా మార్చి 2024 చివరి నాటికి 8.15 శాతం నుంచి సెప్టెంబర్ 2024 చివరి నాటికి దాదాపు 9.32 శాతానికి పెరిగింది. మార్చి 2024 నాటికి ఆర్‌బీఐ వద్ద 822.10 టన్నుల బంగారం ఉన్నది. ఇందులో దేశీయంగా 408.31 టన్నులు, 387.26 టన్నులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ ఉన్నది. 26.53 టన్నుల బంగారం డిపాజిట్ల రూపంలో ఉంది. ఈ సంవత్సరం ప్రారంభంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నుంచి ఆర్‌బీఐ వంద టన్నుల బంగారాన్ని భారత్‌కు దిగుమతి చేసుకున్నది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ వద్ద 822.10 టన్నుల గోల్డ్ నిల్వలు ఉన్నాయి. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత కారణంగా ఆర్బీఐ విదేశాల్లో ఉంచిన బంగారం నిల్వలను భారత్‌కు దిగుమతి చేసుకుంటున్నది. దాంతో బంగారం సేఫ్‌గా ఉంటుందని అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ 2022 నుంచి భారత్ ఇప్పటి వరకు 214 టన్నుల బంగారాన్ని ఆర్‌బీఐ భారత్‌కు తరలించింది.

## ఆత్మీయులకు ఈ బహుమతులిస్తే.. డబ్బులే డబ్బులు..



**న్యూఢిల్లీ–నవభూమి:** దీపావళి వచ్చేసింది. పండుగ రోజు ఇష్టమైన వారికి బహుమతి ఇచ్చి సర్ ప్రైజ్ చేస్తే కలిగే అనుభూతి చెప్పలేనిది. బహుమతి అనగానే చీరలు, గిఫ్టులు, ఎలక్ట్రానిక్ గ్యాడెట్లు మన మైండ్లోకి వస్తాయి. అయితే బహుమతులను రెండు రకాలుగా విభజించవచ్చు. ఫస్ట్ కేటగిరీలో దుస్తులు, గాడ్జెట్‌లు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, మొబైల్ ఫోన్‌లు, గిఫ్ట్ హ్యాంపర్‌లు తదితరాలు ఉంటాయి. అయితే ఆర్థిక భరోసానిచ్చే గిఫ్టులు కూడా ఉంటాయని మీకు తెలుసా. ఇవి అత్యవసర సమయాల్లో ఆత్మీయులకు అండగా నిలుస్తాయి. వాటిని గిఫ్టుగా ఇస్తే జీవితాంతం గుర్తు పెట్టుకుంటారు. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం..
గోల్డ్ ఇటిఎఫ్: బంగారు ఇటీఎఫ్‌లు (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లు) దీపావళికి అద్భుతమైన కానుక అని చెప్పుకోవచ్చు. గ్రహీత తప్పనిసరిగా డీమ్యాట్ ఖాతాను కలిగి ఉండాలి. గోల్డ్ ఇటీఎఫ్‌లు బంగారం ధరను ట్రాక్ చేస్తాయి. సాధారణ షేర్ల లాగే ఏ క్షణంలోనైనా వీటిని విక్రయించవచ్చు. ఆభరణాల మాదిరిగా కాకుండా డీమ్యాట్ రూపంలో వచ్చినందున భద్రత లేదా నిల్వ ఆందోళనతో యజమాని బాధపడాల్సిన అవసరం లేదు.
**ఫిక్స్‌డ్ డిపాజిట్లు:** ఫిక్స్‌డ్ డిపాజిట్లు లేదా ఎఫ్‌డీలు సురక్షితమైన రాబడిని అందిస్తాయి. కాబట్టి ఎఫ్‌డీలు అద్భుతమైన బహుమతి అని చెప్పుకోవచ్చు. బ్యాంకుల నుంచి సులభంగా కొనుగోలు చేయవచ్చు.
రికరింగ్ డిపాజిట్లు: పొదుపు క్రమశిక్షణను పాటించడానికి ఇవి ఉపయోగపడతాయి. బ్యాంకులు లేదా పోస్టాఫీసులలో ఈ ఖాతాలను తెరవవచ్చు. కూడా తక్కువ నష్టాన్ని కలిగి ఉంటాయి. బీమా పాలసీ: బీమా పాలసీ అత్యుత్తమ బహుమతుల్లో ఒకటి. ప్రియమైన వారి కోసం ఆరోగ్య బీమా ప్రీమియం కొనుగోలు చేయడం మంచిది. సింగిల్ ప్రీమియం ఆరోగ్య బీమా పాలసీలను కొనుగోలు చేయవచ్చు. ఆరోగ్య సంరక్షణ ఖర్చులు పెరగడం వల్ల ఆసుపత్రులకు వెళ్తే జేబుకు చిల్లు పడుతుంది. ఆరోగ్య బీమా చేయించడం ఆత్మీయులకు మంచి గిఫ్ట్ అని చెప్పుకోవచ్చు. మరొక విలువైన బహుమతి టర్మ్ జీవిత బీమా. ఎండోమెంట్ పాలసీలతో పోలిస్తే, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ చౌకగా ఉంటుంది. ఆత్మీయుల జీవితానికి భరోసా ఇవ్వడానికి టర్మ్ పాలసీని బహుమతిగా ఇవ్వవచ్చు.
సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లలకు బహుమతిగా ఏదైనా ఇవ్వాలనుకుంటే, సుకన్య సమృద్ధి యోజన తీసుకోవడం మంచిది. ఇది 8.2 శాతం వడ్డీ రేటును కలిగి ఉంటుంది.

# తగ్గిన కార్ల అమ్మకాలు..

# మారుతి లాభాల స్పీడ్‌కు బ్రేక్




**న్యూఢిల్లీ–నవభూమి:** మారుతి సుజుకీ లాభాల స్పీడ్‌కు బ్రేక్‌పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను సంస్థ రూ.3,102 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది రూ.3,786 కోట్లతో పోలిస్తే 18 శాతం తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనాలను ఉపసంహరించుకోవడంతోపాటు డెట్ మ్యూచువల్ ఫండ్లపై దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను రేట్లలో మార్పుల కారణంగా లాభాలపై ప్రతికూల ప్రభావం చూపాయని కంపెనీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ వెల్లడించారు. రూ.10 లక్షల లోపు ధర కలిగిన వాహన విక్రయాలు తగ్గుముఖం పట్టడం ఆందోళన కలిగిస్తున్నదని, దేశీయ వాహన విక్రయాల్లో 80 శాతానికిపైగా వాటా వీటిదేనన్నారు. ఆదాయంలోనూ నిరాశే ఎదురైంది. ఏడాది క్రితం రూ.37,339 కోట్లుగా ఉన్న కంపెనీ ఆదాయం ఈసారికిరూ.37,449 కోట్లకే పెరిగింది. సంస్థ ఏకీకృత నికర లాభం రూ.3,716 కోట్ల నుంచి రూ.3,069 కోట్లకు తగ్గింది. ఈసారి రూ.35,589 కోట్ల ఆదాయం సమకూరింది. జూలై–సెప్టెంబర్‌లో సంస్థ 5,41,550 యూనిట్ల వాహనాలను విక్రయించింది. దేశీయంగా 4,63,834 వాహనాలను, 77,716 యూనిట్లను ఇతర దేశాలకు ఎగుమతి చేసింది. దేశీయంగా కార్ల అమ్మకాలు నాలుగు శాతం తగ్గగా, అదే విధంగా ఎగుమతులు మాత్రం 12 శాతం చొప్పున పెరిగాయి.

# అమ్మకాలు అంతంతే..మార్కెట్‌లో కనిపించని ధనత్రయోదశి ఉత్సాహం



**హైదరాబాద్– నవభూమి:** బంగారం, వెండి దుకాణాల్లో ఈసారి ధనత్రయోదశి సందడి పెద్దగా కనిపించలేదు. మంగళవారం ఉదయం ఆరంభం నుంచే నీరసంగా మొదలైన వ్యాపారం.. రాత్రిదాకా అంతంతమాత్రంగానే సాగింది. దీంతో అధిక ధరలు కొనుగోళ్లకు అడ్డంకిగా మారాయన్న అభిప్రాయాలు నగల వర్తకుల నుంచి వినిపించాయి. ఈ క్రమంలోనే గత ఏడాదితో పోల్చితే ఈసారి సేల్స్ 10 శాతం పడిపోవచ్చని అంటున్నారు. నిరుడు ధనత్రయోదశికి ఉన్న ధరతో ప్రస్తుత ధరను చూస్తే 33 శాతం ఎగిసినట్టు గుర్తుచేస్తున్నారు. నాడు (నవంబర్ 11, 2023) తులం 24 క్యారెట్ గోల్డ్ రూ.61,200 పలికింది. ఇప్పుడు రూ.81,400గా ఉన్నది. ఏడాది కాలంలో రూ.20,200 పెరుగుదల చోటుచేసుకున్నది. కాగా, ఏటా దీపావళికి రెండు రోజుల ముందు వచ్చే ఈ ధనత్రయోదశి రోజున బంగారం, వెండి, వజ్రాలు, ఇతరత్రా విలువైన లోహాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తే శుభం కలుగుతుందని అందరి (ముఖ్యంగా హిందువులు) నమ్మకం. అందుకే జ్యుయెల్లరీ మార్కెట్‌లో ఈ రోజుకు చాలా ప్రత్యేకత ఉంటూ వస్తున్నది.

**బాగుంది కానీ..**

ఈసారి ధనత్రయోదశి అమ్మకాలు గతంతో చూస్తే 10 శాతం తక్కువగా నమోదు కావచ్చని అఖిల భారత రత్నాలు, ఆభరణాల మండలి చైర్మన్ సైయం మెహ్రా అంటున్నారు. అయితే బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటా 11నిమిషాలదాకా ధనత్రయోదశి ముహూర్తం ఉన్నందున అమ్మకాలు పెరుగుతాయన్న విశ్వాసాన్నే మెహ్రా వ్యక్తం చేస్తున్నారు. అలాగే అధిక ధరల నేపథ్యంలో పరిమాణంపరంగా సేల్స్ తగ్గినా.. విలువపరంగా 20 శాతం ఎక్కువగా నమోదు కావచ్చన్నారు. 2, 3, 4, 5, 8 గ్రాముల బంగారు నాణేలతోపాటు గొలుసులు, చెవి కమ్మలు, బ్రేస్‌లెట్ల వంటి తేలికపాటి నగలకు గిరాకీ కనిపిస్తున్నట్టు చెప్పారు. మరోవైపు రికార్డుస్థాయి ధరలు వ్యాపారావకాశాలను దెబ్బతీశాయని, అందుకే మార్కెట్‌లోకి కస్టమర్లు పెద్దగా రాలేదని జ్యుయెల్లర్స్ చెప్తున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా తులం పుత్తడి ధర గత వారం రూ.81,500 తాకడం గమనార్హం. సోమవారం రూ.400 తగ్గినా.. సేల్స్‌ను అది పెంచలేకపోయింది. నిజానికి దేశంలోకి వచ్చే పసిడి దిగుమతులపై ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించిన సుంకాలు.. అమ్మకాలను పెంచుతాయన్న అభిప్రాయాలు వినిపించాయి. ఈ క్రమంలోనే 99.9 స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ గోల్డ్‌కు ఈసారి డిమాండ్ బాగానే ఉంటుందని ఎంఎంటీసీ–పీఏఎంపీ కూడా అంచనా వేసింది.

**రూ.60,000 కోట్లు..**

ధనత్రయోదశికి బంగారం, వెండి తదితర విలువైన లోహాల కొనుగోళ్లేగాక వాహనాలు, గృహాలు, ఇతరత్రా విలువైన గృహోపకరణాల అమ్మకాలూ జోరుగా సాగుతాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది ధనత్రయోదశి విక్రయాల విలువ దేశవ్యాప్తంగా రూ.60,000 కోట్లుగా ఉండొచ్చని అఖిల భారత వర్తకుల సమాఖ్య (సీఏఐటీ) అంచనా వేస్తున్నది. ఇందులో బంగారం వాటానే రూ.20,000 కోట్లుగా ఉంటుందని, వెండి అమ్మకాలు రూ.2,500 కోట్లుగా ఉంటాయని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్వాల్ అంటున్నారు. వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, స్మార్ట్ టెలివిజన్లు, మొబైల్ ఫోన్లు, మిక్సర్–గ్రైండర్లు, మైక్రోవేవ్ అవెన్లు, ఏసీలు ఇలా అన్నింటికీ గిరాకీ ఉంటుందని చెప్తున్నారు.

**మళ్లీ పెరిగిన బంగారం ధర**

బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. సోమవారం రికార్డు స్థాయిల నుంచి తగ్గిన గోల్డ్ రేట్లు.. మంగళవారం తిరిగి పుంజుకున్నాయి. దీంతో ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి విలువ రూ.300 పెరిగి రూ.81,400 పలికింది. ఇది శనివారం నమోదైన ఆల్‌టైమ్ హై రూ.81,500కు సమీప స్థాయి కావడం గమనార్హం. మరోవైపు వెండి ధర కిలో రూ.200 ఎగిసి రూ.99,700 వద్ద ఆగింది. పారిశ్రామిక, నాణేల తయారీదారుల నుంచి వచ్చిన డిమాండ్ కలిసొచ్చిందంటూ వ్యాపార సరళిని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా, నిరుడు ధనత్రయోదశి రోజున కిలో వెండి రూ.74,000 పలికింది. దీంతో ఏడాదిలో రేట్లు 35 శాతం పెరిగినైట్టైంది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం ధర రూ.80,450గా, 22 క్యారెట్ రూ.73,750గా ఉన్నాయి. రూ.650, 600 చొప్పున పెరుగుదల కనిపించింది.





## భారత్‌లో కింగ్ చార్లెస్ దంపతుల సీక్రెట్ పర్యటన.. వెల్‌నెస్ కేంద్రంలో థెరపీ చికిత్సలు..!

**న్యూఢిల్లీ- నవభూమి:** బ్రిటన్ రాజు కింగ్ చార్లెస్ - 3 సీక్రెట్‌గా భారత్ పర్యటకు వచ్చినట్లు తెలిసింది. సతీమణి క్వీన్ కెమిల్లాతో కలిసి మూడు రోజుల పర్యటన నిమిత్తం బెంగళూరుకు వచ్చినట్లు సమాచారం. అక్టోబర్ 27 నుంచి వారు బెంగళూరులోని ఓ వెల్‌నెస్ సెంటర్‌లో బస చేస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఊటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి.
కింగ్ చార్లెస్ దంపతులు ఈ నెల 21 నుంచి 26 మధ్య కామన్వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశానికి హాజరైన తర్వాత సమోవా నుంచి నేరుగా భారత్‌కు సీక్రెట్‌గా వచ్చినట్లు సదరు కథనాలు తెలిపాయి. వారు బెంగళూరులోని ఓ వెల్‌నెస్ సెంటర్‌లో బస చేస్తున్నట్లు పేర్కొంది. ఈ సెంటర్‌లో యోగా, ధ్యానం వంటి సెషన్స్‌తో సమయం గడుపుతున్నట్లు తెలిసింది. వెల్‌నెస్ సెంటర్ సిబ్బంది కింగ్ చార్లెస్, కెమిల్లాకు వివిధ రకాల థెరపీ చికిత్సలు నిర్వహిస్తున్నట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఈ సీక్రెట్ ట్రిప్ ముగించుకొని ఇవాళ వీరు బ్రిటన్ బయల్దేరనున్నట్లు తెలిసింది. వీరు బస చేస్తున్న వెల్‌నెస్ సెంటర్.. యోగా, ధ్యాన సెషన్‌లు, థెరపీ చికిత్సలకు ప్రసిద్ధి చెందినదిగా ఓ అధికారిని ఊటంకిస్తూ సదరు కథనాలు నివేదించాయి.

## మోదీ బాటలో బలగాలతో డిఫెన్స్ ప్రముఖుల దీపావళి



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొలిసారి 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సంవత్సర సరిహద్దు జవాన్లతో కలిసి దీపావళి పండుగ చేసుకోవడం, వారిలో నైతిక స్థైరాన్ని మరింత పెంచుతూ వస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది మోదీ బాటలోనే ఆర్మీ ప్రముఖులంతా దేశంలోని పలు సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న సాహస జవాన్లతో దీపావళి వేడుకల్లో పాల్గొంటున్నారు. డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ ఈసారి పోర్ట్ బ్లెయిర్‌లో అండమాన్ నికోబార్ కమాండ్ దళాలతో కలిసి దీపావళి వేడుకలు జరపుకోనున్నారు. ఇండియన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది అరుణాచల్ ప్రదేశ్‌కు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి వెళ్లారు. అక్కడే వీరు సరిహద్దు బలగాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొంటారు. నేవీ చీఫ్ అడ్మిర్ ద్వినేష్ త్రివేది గుజరాత్‌లోని పోర్‌బందర్ చేరుకున్నారు. అక్కడి నేవీ సిబ్బందితో కలిసి ఆయన దీపావళి వేడుకల్లో పాల్గొంటారు. పాకిస్థాన్ వైపు నుంచి నిషేధిత స్మగ్లింగ్ కార్యకలాపాలను నిరోధించేందుకు ఈ పోర్ట్ చాలా కీలకంగా ఉంది. భారత వాయిసేన చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఈసారి జమ్మూకశ్మీర్ సెక్టార్‌లో బలగాలతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొంటున్నారు. ప్రతి దీపావళి పండుగను సరిహద్దుల్లోని ఫ్రంట్ పోస్ట్ బలగాలతో జరుపుకోవడం ప్రధాని పదేళ్లుగా కొనసాగిస్తుండగా, దసరా పర్వదినాన ఆయుధ పూజ నిర్వహించడాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. 2019లో రక్షణ శాఖ మంత్రి ఈ ఆయుధ పూజ ప్రారంభించారు. ఆ సమయంలో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో తొలి రాఫెల్‌ను ప్రవేశపెట్టేందుకు రాజ్‌నాథ్ ఫ్రాన్స్ వెళ్లివచ్చారు. రాజ్‌నాథ్ బాటలోనే ఆర్మీ చీఫ్ సహా పలువురు సీనియర్ అధికారులు సిక్కిం, పశ్చిమబెంగాల్ సహా పలు చోట్ల దసరా వేడుకలను బలగాల మధ్య జరుపుకొన్నారు.

## దీపోత్సవ్‌కు నన్ను ఆహ్వానించలేదు.. అయోధ్య ఎంపీ ఆవేదన

**న్యూఢిల్లీ- నవభూమి:** సరికొత్త గిన్నెస్ రికార్డులే లక్ష్యంగా 'దీపోత్సవ్' కు అయోధ్య సిద్ధమవుతుండగా తనను మాత్రం ఈ ఈవెంట్‌కు ప్రభుత్వ యంత్రాంగం ఆహ్వానించ లేదని సమాజ్‌వాదీ పార్టీ నేత, ఫైజాబాద్ ఎంపీ అవదేశ్ ప్రసాద్ బుధవారంనాడు తెలిపారు. కలిసి చేసుకునే పండుగలను కూడా బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు.



"దీపావళికి సందర్భంగా అయోధ్య వాసుందరికీ శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. ఇక్కడి నుంచి ఎంపీగా గెలవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మన పండుగలను కూడా బీజేపీ రాజకీయం చేస్తోంది. సోదరభావంతో అందరూ కలిసికట్టుగా చేసుకునే పండుగ ఇది. ఇక్కడ కూడా రాజకీయాలు చేసి ప్రజలను విడగొట్టాలని బీజేపీ చూస్తోంది. నాకు ఒక పాసు కానీ, ఆహ్వానం కానీ పంపలేదు. ఈ పండుగ ఏ ఒక్క మతానికో చెందినది కాదు. నాకు పాసు ఇవ్వకపోయినా, ఆహ్వానించకపోయినా ఈరోజు నేను అయోధ్య వెళ్తున్నాను" అని అవదేశ్ ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది జూన్‌లో జరిగి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి లల్లూ సింగ్‌ను అవదేశ్ ప్రసాద్ ఓడించారు.

## వ్యూహం మార్చిన బీజేపీ... ఈసారి ఎక్కువ ర్యాలీల్లో ప్రచారం చేసేది మోదీ కాదు

**న్యూఢిల్లీ- నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల గడువు మంగళవారం ముగియడంతో ఎన్నికల ప్రచారం ఒక్కసారిగా



ఊపందుకుంటోంది. మహాయుతి కూటమి, మహా వికాస్ అఘాడి తమ అగ్రనేతలను ప్రచారబరిలోకి దింపుతున్నాయి. 50కి పైగా బహిరంగ సభల్లో బీజేపీ అగ్రనేతలు పాల్గొనేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖులు ఈ బహిరంగ సభల్లో పాల్గొంటారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెస్ట్ మహారాష్ట్ర, విదర్భ, ముంబై-కొంకణ్, నార్త్ మహారాష్ట్ర, మరాఠ్వాడాల్లో 8 పబ్లిక్ మీటింగ్స్‌లో పాల్గొంటారు. ఎక్కువ పబ్లిక్ మీటింగ్స్‌లో పాల్గొనే బాధ్యత దేవేంద్ర ఫడ్నవిస్, నితిన్ గడ్కరి, చంద్రశేఖర్ బవాంకులేకి అప్పగించారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివిధ జిల్లాల్లో 15 ర్యాలీల్లో పాల్గొంటారు. ఆయనతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. వీటితో పాటు స్థానిక నేతలు సైతం పలు ర్యాలీలు నిర్వహించనున్నారు.

# హైదరాబాద్ ప్రజలకు బ్యాడ్ న్యూస్.. 5శాతం మరణాలు దాని వల్లేనంట..!



**న్యూఢిల్లీ- నవభూమి:** ప్రపంచ దేశాలన్నీ నిత్యం వాయు కాలుష్యంతో సతమతం అవుతూనే ఉన్నాయి. ప్రజలకు నాణ్యమైన గాలి దొరకడం కష్టం అవుతోంది. వాయుకాలుష్యంతో ప్రజలే కాకుండా పక్షులు, జంతువులు కూడా ఇబ్బంది పడుతున్నాయి. అంతేకాదు వాయుకాలుష్యంతో ఇళ్లు, వాహనాల రంగులూ మారుతున్నాయి. తాజాగా.. 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్' మరో కీలక అంశాన్ని వెల్లడించింది. వాయు కాలుష్యం వల్ల బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఉంది. వాయు కాలుష్యం వల్ల శ్వాసకోస సమస్యలు పెరుగుతున్నాయి. దీంతో ఆస్తమా వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారు. అలాగే.. వాయు కాలుష్యం వల్ల కొన్ని పదార్థాల కారణంగా కళ్లపైనా ఆ ప్రభావం చూపుతున్నట్లుగా ప్రచారం ఉంది. కళ్లలో డస్ట్ పడడం వల్ల కళ్లు ఎర్రబడడం, పొడిబారడం వంటివి చూస్తూనే ఉన్నాం. దాంతో కళ్లకు కూడా వాయు కాలుష్యంతో ఇబ్బందులు ఉన్నాయి. మరోవైపు.. గాలిలో నైట్రోజన్ డైఆక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిలు పెరగడం వల్ల నాడీ వ్యవస్థకూ ప్రమాదం ఉందని కొన్ని సర్వేలు చెబుతున్నాయి. దీని వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత లోపిస్తాయి. అటు గర్భిణులు సైతం వాయు కాలుష్యం బారిన పడడం వల్ల పిల్లలు తక్కువ బరువుతో పుడుతారని ప్రచారం ఉంది. వాయు కాలుష్యం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నివసించడం ద్వారా దగ్గు, ఆయాసం వంటి సమస్యలు నిత్యం వస్తాయి. శ్వాసకోశ సమస్య వల్ల వాటితోపాటే లంగ్ క్యాన్సర్ కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అంతేకాదు.. వాయుకాలుష్యం వల్ల మనిషి ఆయుష్షు కూడా తగ్గుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. వీటితోపాటే 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్' మరో సంచలన అంశాన్ని పేర్కొంది. దేశంలోని ప్రధాన నగరాల్లో వాయుకాలుష్యం చాలా వరకు ఉంటోంది. జనాలకు మించి వాహనాలు ఉండడం.. సిటీకి దగ్గర్లోనే ఫ్యాక్టరీలు ఉండడం వల్ల ప్రజలకు వాయుకాలుష్యం వల్ల చాలా ఇబ్బందులు వస్తున్నాయి. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీని ఏటా వాయుకాలుష్యం చుట్టుముట్టేస్తోంది. చలికాలం వస్తోంది అంటే అక్కడి ప్రజలు భయపడిపోతున్నారు. మరో రాజధాని హైదరాబాద్ నగరంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజురోజుకూ ఇక్కడ గాలి నాణ్యత పడిపోతూనే ఉంది. దాంతో ఏటా ఇక్కడ సంభవించే మరణాల్లో 5శాతం వాయు కాలుష్యంతోనే అని 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్' తన నివేదికలో వెల్లడించింది.. ఆంధ్రప్రదేశ్ నెం.2! దేశంలో పది నగరాల్లో వాయుకాలుష్యం కారణంగా ఎన్ని మరణాలు సంభవిస్తున్నాయని 'ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్' స్టడీ చేసింది. 2008-2019 మధ్య 36లక్షల మరణాలను అధ్యయనం చేసింది. ఇలా ఏటా 1567 మంది మరణిస్తున్నట్లుగా వెల్లడించింది. ఇక సాధారణ రోజులతో పోలిస్తే దీపావళి సమయంలో కాలుష్యం మరింత విపరీతంగా పెరుగుతోంది. పీసీబీ గణాంకాల ప్రకారం సాధారణ సమయంలో పీఎం 2.5 స్థాయి.. ఘనపు మీటరు గాలిలో 35-55 మైక్రోగ్రాములు ఉండగా.. దీపావళి సమయంలో 55-105 మైక్రోగ్రాములకు పెరుగుతోంది. అటు శబ్ద కాలుష్యం కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి.

## రెస్టారెంట్‌లో కుర్చీ కోసం రెండు కుటుంబాల మధ్య ఫైట్..



**ఇస్లామాబాద్:నవభూమి:** రెస్టారెంట్‌లో ఒక కుర్చీ కోసం రెండు కుటుంబాల మధ్య ఫైట్ జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన వారు ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. రెస్టారెంట్ సిబ్బంది, పోలీసుల జోక్యంతో వివాదం ముగిసింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పొరుగు దేశమైన పాకిస్థాన్‌లోని కరాచీలో ఈ సంఘటన జరిగింది. అక్టోబర్ 27న ఖయాబాన్-ఎ-సహర్‌లోని ఒక రెస్టారెంట్‌లో రెండు కుటుంబాల వారు పక్కపక్కనే కూర్చున్నారు. కుర్చీలు ఖాళీ లేకపోవడంతో కొందరు వ్యక్తులు నిల్చొని ఉన్నారు.
కాగా, కొందరు మహిళలు లేచి వెళ్లడంతో ఖాళీ అయిన కుర్చీని ఒక మహిళ తీసుకుంది. దీని గురించి ఆ మహిళలు వాగ్వాదానికి దిగారు. దీంతో రెండు కుటుంబ సభ్యుల మధ్య మాటల వాడి పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ నేపథ్యంలో ఇరు కుటుంబాలకు చెందిన వారు, మహిళలతో సహా కొట్టుకున్నారు. చెంపలు చెళ్లుమనిపించుకోవడంతోపాటు పిడిగుద్దులు కురిపించుకున్నారు.
మరోవైపు రెస్టారెంట్‌లో కొట్టుకున్నవారిలో సింధు హోం సెక్రటరీ కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. అలాగే ఇరు కుటుంబాలు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే ప్రముఖుల జోక్యంతో ఈ వివాదం సద్దుమణిగింది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇరు పక్షాలు రాజీపడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ ఘర్షణపై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. కాగా, రెస్టారెంట్‌లో కుర్చీ కోసం రెండు కుటుంబాల సభ్యులు కొట్టుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## స్పెయిన్‌లో మెరుపు వరదలు.. అనేక మంది మృతి.. కొట్టుకుపోయిన కార్లు



**న్యూఢిల్లీ-నవభూమి:** స్పెయిన్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. మంగళవారం తూర్పు, దక్షిణ స్పెయిన్‌లో భారీ వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 12 అంగుళాల వర్షం కురిసింది. దీంతో అనేక ప్రాంతాలను మెరుపు వరదలు చుట్టుముట్టాయి. ఈ వరదలకు చాలా ప్రాంతాలు నదులను తలపించాయి. రహదారుల వెంబడి నీళ్లు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది గల్లంతయ్యారు. వేలాదిగా కార్లు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి

## మాజీ భార్యలు, 11 మంది పిల్లలను ఒకే దగ్గర పెట్టే ప్లాన్.. లగ్జరీ మ్యాన్షన్ కొన్న మస్క్



**న్యూఢిల్లీ- నవభూమి:** బిలియనీర్ ఎలన్ మస్క్( తన ఫ్యామిలీపై శ్రద్ధ పెట్టారు. 11 మంది పిల్లలు, వాళ్ల తల్లుల కోసం ఓ ఖరీదైన భవంతిని కొనేందుకు మస్క్ ప్లాన్ వేసినట్లు తెలిసింది. ఉమ్మడి కుటుంబం స్టయిల్‌లో ఫ్యామిలీ మొత్తం ఒకే దగ్గర ఉండాలన్న ఉద్దేశంతో సుమారు 14,400 చదరపు అడుగుల విస్తీర్ణంలోని బిల్డింగ్‌ను మస్క్ కొంటున్నారు. దాంట్లో ఆరు బెడ్‌రూమ్‌లు ఉంటాయి. టెక్సాస్ సమీపంలోని ఆస్టిన్‌లో ఉన్న అతనికి ఇంటికి సమీపంలోనే ఈ కొత్త బిల్డింగ్ ఉన్నది. సుమారు 35 మిలియన్ల డాలర్ల ఖరీదుతో ఆ బిల్డింగ్‌ను మస్క్ సొంతం చేసుకోనున్నట్లు తెలుస్తోంది. అత్యంత విలాసవంతంగా ఉండే ఆ భవంతి.. టస్కన్ ప్రేరిత డిజైన్‌తో నిర్మించారు. టెక్సాస్‌లోని మస్క్ ఇంటికి కేవలం 10 నిమిషాల దూరంలో ఈ కొత్త మేడ ఉన్నది. పిల్లల మధ్య సఖ్యత ఏర్పడాలన్న ఉద్దేశంతో అందరికి కలిసి ఆ ఇంటిని తీసుకున్నాడు. ఇక ఆ పిల్లలతో షెడ్యూల్ ప్రకారం టైం గడిపేందుకు కూడా మస్క్ నిర్ణయించారు. 2022 నుంచి ఇప్పటి వరకు మస్క్‌కు 12 మంది పిల్లలు పుట్టారు. మాజీ భార్య జస్టిన్ మస్క్‌కు పుట్టిన తొలి బేబీ.. జన్మించిన 10 వారాల్లోనే మృతిచెందింది. 2008లో ఇదే జంట ఐవీఎఫ్ ద్వారా అయిదుగురు పిల్లలకు జన్మనిచ్చారు. గ్రిఫిన్, వివియన్ కవలలు పుట్టారు. ఆ తర్వాత సాక్సన్, డామియన్, కాయి పుట్టారు. బ్రిటీష్ నటి తలూలా రిలేతో మస్క్ రిలేషన్‌లో ఉన్నారు. ఆమెను పెళ్లి చేసుకుని, రెండు సార్లు విడాకులు ఇచ్చారు. అయితే ఆ జంటకు పిల్లలు పుట్టలేదు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో మ్యూజిక్ స్టార్ గ్రిమ్స్‌తో మస్క్ ముగ్గురు పిల్లలు కన్నారు. మ్యూజీషియన్ గ్రిమ్స్ మరోపేరు క్లారి బౌచర్. ఎక్స్, ఎక్స్‌ట్రా డార్క్ సిడీరల్, టెక్నో మెకానికస్ అనే పేర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఈ పిల్లల కస్టడీ కోసం గ్రిమ్స్, మస్క్ మధ్య లీగల్ యుద్ధం నడుస్తున్నది. 2021లో శివోన్ జిల్లిస్ అనే మహిళతో రహస్యంగా రిలేషన్ కొనసాగించారు మస్క్. ఆమెకు ట్విన్స్ పుట్టారు. మస్క్‌కు చెందిన బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో శివోన్ జిల్లిస్ పనిచేస్తున్నది. ఈ మధ్యే మూడవ చిన్నారికి కూడా జన్మనిచ్చినట్లు మస్క్ ప్రకటించారు. అయితే కొత్తగా ఖరీదు చేసిన ఇంట్లోకి జిల్లిస్ తన ముగ్గురు పిల్లలతో కలిసి వెళ్లినట్లు తెలుస్తోంది.

## స్పేస్ స్టేషన్‌కు ముగ్గురు వ్యోమగాముల్ని పంపిన చైనా



AFP

**జిక్వాన్-నవభూమి:** టియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్(కు ముగ్గురు వ్యోమగాములను చైనా పంపింది. షెంజౌ-19 మానవసహిత స్పేస్‌షిప్‌ను చైనా ప్రయోగించింది. లాంగ్ మార్చ్-2ఎఫ్ రాకెట్ ద్వారా ముగ్గురు టైకోనాట్లు నింగిలోకి వెళ్లారు. ఇవాళ తెల్లవారుజామున 4.27 నిమిషాలకు జిక్వాన్ శాటిలైట్ లాంచ్ సెంటర్ నుంచి రాకెట్ ఎగిరింది. ఈసారి వ్యోమగాముల్లో మహిళా టైకోనాట్ కూడా ఉన్నది. టియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్‌లో వ్యోమగాములు పలు పరీక్షలు చేపట్టనున్నారు. 2030 నాటికి చంద్రుడి మీదకు చైనా వ్యోమగాములను పంపాలని భావిస్తున్నది. లూనార్ కేంద్రాన్ని నిర్మించాలనుకుంటున్న చైనా ఆ ప్రయత్నాలు మొదలుపెట్టింది.
టైకోనాట్లలో 34 ఏళ్ల వాంగ్ హౌజీ అనే మహిళా ఆస్ట్రోనాట్ ఉన్నారు. స్పేస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళా ఆస్ట్రోనాట్లలో ఆమె మూడవ వ్యక్తి కావడం విశేషం. రాకెట్ ప్రయోగం సక్సెస్ అయినట్లు చైనా స్పేస్ ఏజెన్సీ ప్రకటించింది. కాయి జూజీ నేతృత్వంలో ముగ్గురు వ్యోమగాములు నింగిలోకి వెళ్లారు. ఏప్రిల్ లేదా మే నెలలో వాళ్లు మళ్లీ భూమ్మీదకు రానున్నారు. కాయి జూపీ గతంలో 2022లో షెంజౌ-14 మిషన్ ద్వారా స్పేస్ స్టేషన్‌కు వెళ్లారు. ఆస్ట్రోనాట్లలో 34 ఏళ్ల సాంగ్ లింగ్డాంగ్ కూడా ఉన్నారు.

# క్యాన్సర్‌కు కొత్త చికిత్స.. ఏకకాలంలో కీమోథెరపీ, ఫొటోథెరపీ



**న్యూయార్క్- నవభూమి:** క్యాన్సర్ మహమ్మారికి అమెరికాలోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ)కి చెందిన శాస్త్రవేత్తలు సరికొత్త చికిత్స విధానాన్ని అభివృద్ధి చేశారు. కీమోథెరపీతో పాటు ఫొటోథెరపీని ఒకేసారి చేయడం ద్వారా సమర్థంగా క్యాన్సర్ కణతులను నాశనం చేయొచ్చని వీరు గుర్తించారు. ఈ చికిత్స ద్వారా సైడ్ ఎఫెక్ట్స్‌ను తగ్గించడంతో పాటు బాధితుల జీవితకాలాన్ని పెంచవచ్చని పరిశోధకులు చెప్తున్నారు.
క్యాన్సర్‌కు ఇటీవల కొత్తగా ఫొటోథెరపీ అనే చికిత్స విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది క్లినికల్ ట్రయల్స్ దశలో ఉంది. ఈ చికిత్సలో భాగంగా బంగారు నానోపార్టికల్స్‌ను శరీరంలోని క్యాన్సర్ కణతుల వద్దకు పంపించి, బయటి నుంచి లేజర్ ద్వారా వాటిని వేడి చేస్తారు. ఇవి సమీపంలోని క్యాన్సర్ కణాలను అంతం చేస్తాయి.

**ఒకేసారి రెండు చికిత్సలు**

క్యాన్సర్ చికిత్సకు ఎక్కువగా వినియోగిస్తున్న కీమోథెరపీతో పాటు ఫొటోథెరపీని ఏకకాలంలో చేయడమే ఎంఐటీ శాస్త్రవేత్తలు చెప్తున్న కొత్త చికిత్స విధానం.
ఇందుకోసం వీరు మాలిబ్డినం సల్ఫైడ్ అనే నిరింద్రియ పదార్థంతో పాటు కీమోథెరపీకి వినియోగించే ఔషధాన్ని కలిపి సూక్ష్మ కణాలను తయారుచేసి వినియోగించారు. ఇవి లేజర్ లైట్‌ను 50 డిగ్రీల సెల్సియస్ వేడిగా మార్చడంలో సమర్థంగా పని చేస్తాయని, క్యాన్సర్ కణాలను అంతం చేయడానికి ఈ వేడి సరిపోతుందని పరిశోధకులు తెలిపారు. ఈ సూక్ష్మకణాలు వేడికి కరిగిపోయి వాటిల్లోని కీమోథెరపీ ఔషధాన్ని విడుదల చేస్తాయని చెప్పారు.

## మహిళా రోగికి మత్తుమందు ఇచ్చి.. డాక్టర్ అత్యాచారం



**కోల్‌కతా-నవభూమి:** మహిళా రోగికి డాక్టర్ మత్తుమందు ఇచ్చాడు. ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిని వీడియో తీశాడు. బెదిరించి డబ్బులు వసూలు చేయడంతోపాటు పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. చివరకు బాధితురాలు తన భర్తతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడైన ఆ డాక్టర్‌ను అరెస్ట్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలో ఈ సంఘటన జరిగింది. హస్నాబాద్‌లోని ఇంట్లో క్లీనిక్ నిర్వహిస్తున్న ఆర్ఎంపీ డాక్టర్ 26 ఏళ్ల మహిళా రోగికి మత్తుమందు ఇంజెక్షన్ చేశాడు. మత్తులో ఉన్న ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. తన మొబైల్ ఫోన్‌లో దీనిని రికార్డ్ చేశాడు. సోషల్ మీడియాలో షేర్ చేస్తానని ఆ మహిళను బెదిరించాడు. ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి నాలుగు లక్షల వరకూ వసూలు చేశాడు. ఆ మహిళపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 హైదరాబాద్ గురువారం 31 అక్టోబర్ 2024



## హీరోగా నందమూరి తారక రామారావు గ్రాండ్ ఎంట్రీ..

సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య లాంటి సినిమాలతో డైరెక్టర్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు వైవీఎస్ చౌదరి . ఇప్పటికే పలువురు యాక్టర్లను ఇండస్ట్రీకి పరిచయం చేసిన ఈ టాలెంటెడ్ డైరెక్టర్ తాజాగా సీనియర్ ఎన్టీఆర్ కుటుంబం నుంచి కొత్త నటుడిని అందరికీ పరిచయం చేస్తున్నాడు.దివంగత సీనియర్ ఎన్టీఆర్ కుమారుడు నందమూరి హరికృష్ణ మనవడు (జానకిరామ్ కుమారుడు) నందమూరి తారకరామారావు ఫస్ట్ దర్శన్ వీడియోను షేర్ చేశాడు వైవీఎస్ చౌదరి. ప్రొడక్షన్ నంబర్ 1గా రాబోతున్న ఈ చిత్రాన్ని %చీవష ఖ్రీవత్ =శ్రుతీం% బ్యానర్‌లో వైవీఎస్ చౌదరి సతీమణి యలమంచిలి గీత నిర్మిస్తుండటం విశేషం.నందమూరి తారకరామారావు హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు ఫస్ట్ దర్శన్ వీడియో చెప్పకనే చెబుతోంది. నటుడిగా అందరినీ ఇంప్రెస్ చేసేందుకు యాక్టింగ్, ఫైట్స్‌లో శిక్షణ తీసుకోవడంతోపాటు మేకోవర్ కూడా మార్చుకున్నట్టు తాజా లుక్స్‌తో తెలిసిపోతుంది. ఈ చిత్రానికి లెజెండరీ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా.. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు సమకూరుస్తున్నారు. చంద్రబోస్ పాటలు అందిస్తున్నాడు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.



## సుహాస్ జనక అయితే గనక ఓటీటీ ప్రీమియర్ టైం వచ్చేసింది..



కలర్‌ఫొటో సినిమాతో హీరోగా మంచి బ్రేక్ అందుకున్నాడు టాలీవుడ్ యాక్టర్ సుహాస్ ఆ తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఈ టాలెంటెడ్ యాక్టర్ ఇటీవలే 'జనక అయితే గనక' సినిమా చేశాడని తెలిసిందే. సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించిన ఈ మూవీ సెప్టెంబర్ 7న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలై.. మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రాన్ని దిల్‌రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్‌రెడ్డి, హన్షిత నిర్మించారు. సంగీత్, వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఓటీటీలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రెడీ అయింది. ఈ చిత్రం నవంబర్ 8న ఆహాలో డిజిటల్ ప్రీమియర్ కానుంది. ప్రీమియర్ డేట్ కంటే ఒక రోజు ముందే ఆహా గోల్డ్ సబ్ స్క్రైబర్లు యాక్సెస్ చేసుకునే అవకాశముంది.ఆ ఒక్క డెసిషన్ నా లైఫ్‌ను మార్చేసింది. నేను ఒకవేళ తండ్రిని అయితే నా వైఫ్‌ను సిటీలో ఉన్న బెస్ట్ ఆస్పత్రిలో చూపించాలి. నా పిల్లలను బెస్ట్ స్కూల్‌లో చదివించాలి, బెస్ట్ కాలేజిలో చదివించాలి. వాళ్లకి బెస్ట్ లైఫ్ ఇవ్వాలి. బెస్ట్ ఇవ్వలేనప్పుడు పిల్లలను కనకూడదు.. అంటూ టీజర్, ట్రైలర్‌లో సాగుతున్న డైలాగ్స్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీస్‌కు కనెక్ట్ అవుతూ.. సినిమాపై హైప్ క్రియేట్ చేశాయి. మరి ఈ చిత్రం ఓటీటీలో ఎలాంటి రియాక్షన్ రాబట్టుకుంటునేది చూడాలి.

## చిరంజీవి విశ్వంభరలో లక్కీభాస్కర్ హీరోయిన్.. మీనాక్షి చౌదరి ఏమన్నదంటే..?

ప్రస్తుతం సౌతిండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా మారిపోయింది మీనాక్షి చౌదరి. బ్యాక్ టు బ్యాక్ స్టార్ హీరోల సినిమాలతో బిజీగా ఉంటూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ భామ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి లక్కీ భాస్కర్. దుల్కర్ సల్మాన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రం అక్టోబర్ 31న దీపావళి కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు టీం మెంబర్స్.

బిజీగా ఉన్న ఈ భామ మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న విశ్వంభరలో కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు తెరపైకి రావడమే కాదు.. వికీపీడియా కాస్ట్ సెక్షన్‌లో మీనాక్షి చౌదరి పేరు కూడా దర్శనమిస్తుంది. ఈ విషయమై లక్కీ భాస్కర్ ప్రమోషన్స్‌లో స్పష్టత ఇచ్చింది. నేను విశ్వంభరలో నటించడం లేదు. నేను ఈ సినిమా చేస్తున్నారని ఎవరు చెప్పారో నాకు తెలియదు. నా పేరు వికీపీడియాలో ఉందని తెలుసు. ప్రతీ ఒక్కరూ నేను విశ్వంభరలో నటిస్తున్నానని చెప్తున్నారు. అలాంటిదేం లేదు. ప్రతీ ఇంటర్వ్యూలో నాకు ఈ ప్రశ్న వేస్తున్నారు. ఒకవేళ నేను భాగస్వామ్యం అయితే నేను ప్రకటిస్తా. లేదంటే ఎలాంటి ప్రకటన చేయనంటూ చెప్పుకొచ్చింది. దీంతో పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది.ఈ సినిమా సంక్రాంతికి విడుదల కావాల్సి ఉండగా.. గేమ్ ఛేంజర్ విడుదల నేపథ్యంలో వేసవిలో రిలీజయ్యే అవకాశాలున్నాయి. మీనాక్షి చౌదరి మరోవైపు వెంకీ అనిల్ 3, మెకానిక్, మట్కా చిత్రాల్లో నటిస్తోంది.




మీనాక్షి చౌదరి



## మంచు లక్ష్మి న్యూ స్టైల్: బోల్డ్ - బ్యూటిఫుల్

ఇటీవల మంచు లక్ష్మి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ కొత్త వీడియోను షేర్ చేయడం సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ ను తెచ్చుకుంది. ఈ వీడియోలో, ఆమె ట్రెడిషనల్ లుక్‌ను హై ఫ్యాషన్ గ్లామర్ టచ్ తో ప్రదర్శిస్తూ కనిపించారు. పండగ టైమ్ లో మిఠాయి అంటూ ఒక సరదా క్యాప్షన్ ఇచ్చి, ఆమె తన అందంతో ప్రేక్షకులను అలరిస్తు న్నారు. పచ్చటి వృక్షాల మధ్య, తెల్లని డ్రెస్ లో ఎలిగెంట్ లుక్ లో ఉన్న ఈ ఫోటోలు చూసిన ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు.ఈ ఫోటోల్లో ఆమె ధరించిన జువెలరీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎమెరాల్డ్ స్టోన్స్, ముత్యాలతో అలంకరించిన చెవి రింగ్స్, నెక్లెస్, చూడీలు అన్నీ కలిపి ఆమె గ్లామర్ లుక్ కి మరింత అందాన్ని తెచ్చాయి. మన తెలుగులో చాలా మంది హీరోయిన్లు తమ గ్లామర్ ప్రెజెన్స్ ను సింపుల్ గా ప్రదర్శిస్తుంటారు కానీ, మంచు లక్ష్మి మాత్రం తన స్టైల్ స్టేట్ మెంట్ ను ప్రత్యేకంగా చూపించడానికి ప్రయత్నిస్తారు. ఈ వీడియోలో ఆమె చూపించిన కిల్లింగ్ లుక్స్ నెటిజన్లను ఆశ్చర్యానికి గురి చేశాయి.ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే మంచు లక్ష్మి, తరచూ తన కొత్త లుక్స్ ను అభిమానులతో పంచుకుంటూ ట్రెండ్ సృష్టిస్తున్నారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ లో పెట్టే ప్రతి ఫోటో అనేది కేవలం ఫ్యాషన్ ఫ్యాన్స్ ని మాత్రమే కాదు, మరింత అభిమానులను తన వైపు ఆకర్షిస్తున్నాయి. ఈ వీడియో ద్వారా, ఆమె తన వయసుతో సంబంధం లేకుండా గ్లామర్ కి మరింత దగ్గరగా ఉంటుందని మరోసారి నిరూపించారు.సోషల్ మీడియాలోని ఫాలోవర్స్ కూడా ఆమె లుక్స్ కి ఫిదా అవుతూ విపరీతమైన జోష్ లో లైకులు, కామెంట్లు చేస్తూ తెగ హడావిడి చేస్తున్నారు. ఇక మంచు లక్ష్మి ప్రస్తుత ప్రాజెక్ట్‌లలో, ప్రత్యేకంగా 'ఆదిపర్వం' సినిమా, బాగా క్రేజ్ లో ఉంది. పిరియడిక్ బ్యాక్ డ్రాప్ లో యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం నవంబర్ 8న విడుదలకు సిద్ధంగా ఉంది.ఈ లుక్ లో కనిపించిన మంచు లక్ష్మి కి సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఆమె బాలీవుడ్ లో కూడా అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల ముంబైకి షిఫ్ట్ అయిన ఆమె, అక్కడ కూడా కొత్త ప్రాజెక్టుల కోసం ఎదురుచూస్తున్నారు. మొత్తానికి, ఈ వీడియో ద్వారా తన స్టైల్ సెన్స్ తో పాటు, తన నటనా ప్రావీణ్యం కూడా చూపిస్తున్న మంచు లక్ష్మి, తెలుగులో మాత్రమే కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలనే తపనను వ్యక్తం చేస్తున్నట్లు అనిపిస్తోంది.

## పుష్ప 2 మేనియా.. క్లైమాక్స్‌లో సర్‌ప్రైజ్ షాక్



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా, సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న 'పుష్ప 2'పై ఆసక్తి అంతకంతకూ పెరుగుతోంది. సినిమా విడుదల తేదీ డిసెంబరు 5గా ఫిక్స్ కాగా, ఆ రోజు ఈ సినిమా వసూళ్లలో కొత్త రికార్డులు సృష్టించబోతుందని ఇప్పటికే బలమైన టాక్ వినిపిస్తోంది. సుకుమార్ ఈ సినిమా కోసం చాలా ఎక్కువ టైమ్ తీసుకున్నారు. 'పుష్ప 1' కంటే హై రేంజ్ ల తీసుకెళ్లడానికి కసరత్తు చేస్తున్నారు. సీక్వెల్‌లో కథా కథనాలు, యాక్షన్ సీక్వెన్సులు, అల్లు అర్జున్ క్యారెక్టరైజేషన్ ఇంకా పర్‌ఫెక్ట్‌గా ఉంటాయని సుకుమార్ ఈ మధ్యే వెల్లడించారు. అయితే, ఈ సినిమాతోనే కథ ఫినిష్ అవ్వదు. 'పుష్ప' ప్రయాణం ఇంకా ఉందట. క్లైమాక్స్‌లో సుకుమార్ 'పుష్ప 3'కి లీడ్ ఇచ్చే సీన్స్‌ను ప్లాన్ చేస్తున్నారు. ఈ క్లైమాక్స్‌లో సర్‌ప్రైజింగ్ షాక్ ఉండబోతోందట. ఈసారి ఓ ప్రముఖ హీరో వాయిస్ వినిపించబోతోందని, ఆ వాయిస్ ద్వారా 'పుష్ప 3' కోసం ప్రేక్షకులను మరింత ఉత్సాహపరచాలనే ఉద్దేశంతో ఈ ఎత్తుగడ వేసినట్లు సమాచారం. అప్పట్లో 'బాహుబలి' క్లైమాక్స్‌లో 'కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు' అనే ప్రశ్న ప్రేక్షకుల ఆసక్తిని పీక్స్‌కి తీసుకెళ్లినట్టు, ఇక్కడ కూడా ఆ హీరో ఎవరు? ఎందుకు వచ్చాడు? అనే ప్రశ్నలతో 'పుష్ప 3'పై హైప్ క్రియేట్ చేయాలనుకుంటున్నారట. ఇప్పటికే సుకుమార్ ఈ క్లైమాక్స్ సీన్ కోసం ఒక ప్లాన్ అనుకున్నట్లు తెలుస్తోంది. అందుకు సంబంధించిన సన్నివేశం అయితే పూర్తి చేయలేదు. ఇంకా చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. పుష్ప 3కి లీడ్ ఇచ్చే మరో హీరో పాత్రను ఎవరూ పోషిస్తే బాగుంటుందని చిత్రబృందం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.నవంబర్ 4న 'పుష్ప 2' ఐటెమ్ సాంగ్ షూటింగ్ మొదలవుతుంది. ఈ పాటకు 5 రోజుల షెడ్యూల్ ప్లాన్ చేశారు. ఆ తర్వాత 'పుష్ప 3'కి లీడ్ ఇస్తున్న క్లైమాక్స్ సీన్లను షూట్ చేయబోతున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా పాన్ ఇండియా రేంజ్ లిప్ క్లిక్కయ్యే హీరోనే తీసుకోవాలని అనుకుంటున్నారు.

## ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో బుమ్రాను దాటేసి అగ్రస్థానంలోకి రబాడా



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో దక్షిణాఫ్రికా ఫాస్ట్ బౌలర్ కాగిసో రబాడా అరుదైన ఘనత సాధించాడు. భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ను దాటేసి అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ లో అద్భుతంగా రాణిస్తున్న రబాడా ఇటీవల బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు మ్యాచ్‌లో 300 వికెట్ల మైలురాయిని చేరుకున్నాడు. దాంతో టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆయనకు అగ్రస్థానం దక్కింది.29 ఏళ్ల రబాడా బంగ్లాతో జరిగిన రెండు టెస్టుల్లో 9 వికెట్లు తీయడం ద్వారా దక్షిణ్రికా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అంతేగాక జస్ప్రీత్ బుమ్రా, జోష్ హాజిల్‌వుడ్, రవిచంద్రన్ అశ్విన్‌లను దాటేసి టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం దక్కించుకున్నాడు. ప్రస్తుతం హాజిల్‌వుడ్ రెండో స్థానంలో, బుమ్రా మూడో స్థానంలో, అశ్విన్ నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు. కాగా 2019 తర్వాత రబాడా అగ్రస్థానంలో రావడం ఇదే తొలిసారి.2018 జనవరిలో తొలిసారి ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో టాప్-10 లోకి వచ్చిన రబాడా ఆ తర్వాత వరుసగా ఏడాదిపాటు టాప్-10 లో కొనసాగుతూ వచ్చాడు. 2019 ఫిబ్రవరిలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. ఆ తర్వాత మళ్లీ రబాడా అగ్రస్థానంలోకి రావడం ఇదే తొలిసారి. ఇదిలావుంటే పాకిస్థాన్ స్పిన్నర్ నొమాన్ అలీ తొలిసారి టాప్-10 జాబితాలో చోటు సంపాదించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్టులో 9 వికెట్లు తీయడం ద్వారా నొమాన్ ఏకంగా 8 స్థానాలు ఎగబాకి టాప్ టెన్‌లోకి దూసుకొచ్చాడు. ప్రస్తుతం అతను జాబితాలో 9వ స్థానంలో కొనసాగుతున్నాడు.

## జస్ప్రీత్ బుమ్రాను వెనక్కి నెట్టిన దక్షిణాఫ్రికా బౌలర్.. ఐసీసీ టెస్ట్ నెంబర్ వన్ బౌలర్‌గా రబాడ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ బౌలర్‌గా దక్షిణాఫ్రికా ఆటగాడు కసిగో రబాడ నిలిచాడు. ఇప్పటి వరకు అగ్రస్థానంలో కొనసాగిన భారత మిస్టరీ బౌలర్ జస్ప్రీత్ బుమ్రాను వెనక్కి నెట్టాడు. బుమ్రా ఏకంగా రెండు ర్యాంకులు దిగజారి మూడోస్థానానికి చేరాడు. మిర్పూర్‌లో జరిగిన తొలి టెస్ట్‌లో బంగ్లాదేశ్‌పై రబాడ తొమ్మిది వికెట్లు కూల్చాడు. దీంతో ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడు ర్యాంకులు ఎగబాకి అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఆ మ్యాచ్‌లో రబాడ 300 టెస్ట్ వికెట్ల మైలురాయిని సైతం అందుకున్నాడు. రబాడ మళ్లీ చాలా సంవత్సరాల తర్వాత మళ్లీ నెంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. కెరీర్‌లో తొలిసారిగా 2018 జనవరిలో టాప్ టెస్ట్ బౌలర్‌గా నిలిచాడు. 2019 ఫిబ్రవరిలో నెంబర్ వన్ స్థానం నుంచి దిగజారాడు. ఇదిలా ఉండగా.. టీమిండియా బౌలర్ బుమ్రా 846 పాయింట్లతో మూడోస్థానాకి చేరాడు.ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ నెంబర్-2 స్థానంలో ఉన్నాడు. టాప్-4లో భారత వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్, ఆస్ట్రేలి యా కెప్టెన్, ఫాస్ట్ బౌలర్ పాట్ కమిన్స్ ఐదో స్థానంలో ఉన్నారు. స్పిన్నర్ రవీంద్ర జడేజా రెండుస్థానాలు దిగజారి.. ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు.

## మళ్లీ ఆర్సీబీ కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ !



**ముంబై-నవభూమి:** రాబోయే ఐపీఎల్ సీజన్(2025)కు చెందిన ప్లేయర్ల రిటెన్షన్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. గురువారమే రిటెన్షన్‌కు చివరి తేదీ. దీంతో పలు ఫ్రాంచైజీలు కొత్త ప్లేయర్ల కోసం ఎదురుచూస్తున్నాయి. అయితే కొందరు ఆటగాళ్లు మాత్రం పాత ఫ్రాంచైజీలకే ఫిక్స్ అయ్యేందుకు సిద్ధపడ్డారు. ఇక బెంగుళూరు రాయల్ ఛాలెంజర్స్ జట్టుకు .. విరాట్ కోహ్లీ(%ఎఱతీఖ్ ఖశీష్ట్రశీఱ%) కెప్టెన్సీ పగ్గాలు చేపట్టే అవకాశాలు ఉన్నాయి. ఐపీఎల్ 2021లో ఆర్సీబీ కెప్టెన్సీని విరాట్ వదులుకున్నాడు. ఆ తర్వాత నుంచి డూప్లిసిస్ ఆ జట్టుకు నాయకత్వం వహించాడు. అయితే ఈసారి కొత్త కెప్టెన్ కోసం ఆర్సీబీ ప్రయత్నించినట్లు తెలిసింది. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన శుభమన్ గిల్‌ను ఆర్సీబీకి రప్పించే ప్రయత్నాలు జరిగాయి. కానీ గిల్ తన పాత ఫ్రాంచైజీతో కొనసాగేందుకు మొగ్గుచూపినట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో విరాట్ కోహ్లీకి ఆర్సీబీ సారథ్య బాధ్యతలు దక్కే అవకాశాలు ఉన్నాయి.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**